KR TV
మన క్రాంతి
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :106 | ఆదివారం 16 మార్చి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్సీలు

## పదే పదే అబద్ధాలు చెబుతున్నారు



శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. జయజయహే తెలంగాణాకు ఆంధ్ర వ్యక్తి ఎం.ఎం కీరవాణి సంగీతం ఇవ్వడం పట్ల సోషల్ మీడియాలో అభ్యంతరం వ్యక్తం అవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ తల్లికి దండ వేయని వ్యక్తి తెలంగాణ తల్లి విగ్రహ రూపం రూపొందించారని దుయ్యబట్టారు. తెలంగాణ విగ్రహ రూపం మార్చడం సరైంది కాదని అన్నారు. తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ, బోనాలు ఆ రెండూ లేకుండా విగ్రహం రూపొందించారని ఆగ్రహ వ్యక్తం చేశారు. మరోవైపు.. 2.64 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది అంటే అందులో కాళేశ్వరం పాత్ర కూడా ఉందని వెల్లడించారు. మేడిగడ్డను బూచిగా చూపించారు.. ఇవాళ పంటలు ఎండిపోతున్నాయి. పంటలను గొర్రెలు, పశువులు మేస్తున్నాయని కవిత పేర్కొన్నారు. సూటు బూటు వేసుకుని ఉద్యోగం చేయడమే కాదు.. గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుని ఉపాధి పొందడం కూడా ఉపాధేనని తెలిపారు.

2 లో

# నా ఫొటోలు మార్ఫింగ్ చేశారు..

## ఇక వదిలేది లేదంటూ మంత్రి మాస్ వార్నింగ్..



2 లో

సోషల్ మీడియాలో తన ఫొటోలు మార్ఫింగ్ చేసి మానసిక క్షోభకు గురి చేశారంటూ మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్నీ కొంతమంది దుర్మార్గులు తప్పుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా వల్ల తాను కుమిలిపోయానని, దాన్ని కట్టడించడం చాలా అవసరమని అన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తున్నారని, దాంతో తాను డీ మోరల్ అయినట్లు సీతక్క వెల్లడించారు. సోషల్ మీడియాను బీఆర్ఎస్ అబద్ధాల ప్రచారానికి వాడుతోందని, అది కుటుంబాలను బజారుకీడుస్తోందని మండిపడ్డారు.సోషల్ మీడియా దుష్ప్రచారం గురించి తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తామందరికీ రిలీఫ్ అనిపించిందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలు రాజకీయాల్లో ఎదగడమే చాలా కష్టమని, అలాంటిది తాము ఈస్థాయికి వస్తే మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారంటూ ఆగ్రహించారు. సోషల్ మీడియాను సోషల్ సర్వీస్‌కు వాడుకున్న తానూ అందరిలాగానే ఇబ్బందులకు గురైనట్లు చెప్పుకొచ్చారు. కరోనా సమయంలో ఎంతో సర్వీస్ చేశానని, దానిపైనా సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శించారంటూ సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు.

# మాదే తప్పు అయితే క్షమాపణ చెప్తా..



## కేసీఆర్‌కు రేవంత్ సవాల్

- చంద్రబాబు, జగన్ ముందు మోకరిల్లింది కేసీఆర్
- వారి హయాంలోనే పోతిరెడ్డిపాడు ఎత్తు పెరిగింది
- అప్పట్లోనే శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా ఏపీకి నీళ్లు
- కృష్ణా జలాలపై కేసీఆర్ సభకు వచ్చిన రోజునే చర్చ
- గోలీలు ఆడేందుకు ఢిల్లీ వెళ్లదలేదు
- హక్కుల సాధనకు ఎన్నిసార్లైనా వెళతా
- దేశ ప్రధానిని బడే భాయ్ అంటే తప్పేంటి
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో సీఎం రేవంత్

తెలంగాణ అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ క్రమంంలో మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోనే కృష్ణా బేసిన్ జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంలో తమతో చర్చకు సిద్దమా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో కాంగ్రెస్ తప్పు ఉంటే క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పుకొచ్చారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ..'గవర్నర్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. గతంలో గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు జరిగాయి. బలహీనవర్గాలకు చెందిన మహిళ గవర్నర్‌గా ఉంటే.. ఆమెను సూటిపోటి మాటలతో అవహేళన చేశారు. భారత రాజ్యాంగం స్ఫూర్తితో వ్యవస్థలు ఏర్పడ్డాయి. రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గత ప్రభుత్వం ప్రజాస్వామ విలువలను పాటించలేదు. అజ్ఞానమే గొప్ప విజ్ఞానం అనుకుంటున్నారు. గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కార్యకర్త ప్రసంగంలా ఉందని కొందరు అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. గవర్నర్‌ను గౌరవించే బాధ్యత మాది. ?ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశాం.. వాటినే గవర్నర్ ప్రస్తావించారు. మాట్లాడాలనుకున్నదే మాట్లాడతాం. ఎవరు అడ్డుకున్నా వెళ్లిపోతాం అన్నట్టుగా ఉంది బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందన్నారు.

# కేసీఆర్ నిండు నూరేళ్లు

## మంచిగుండాలే : సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లో కేసీఆర్ రెండు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు శాసనమండలిలో సీఎం మాట్లాడారు.

'ఎమ్మెల్యేగా కేసీఆర్ రూ.57లక్షల జీతం తీసుకున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యటించలేదు. వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని గతంలో కేసీఆర్ అన్నారు. కానీ మేం అధికారంలోకి వచ్చాక ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేశాం. కాళేశ్వరం నుంచి చుక్క నీరు లేకుండా రికార్డ్ స్థాయిలో పంట పండింది. గత ప్రభుత్వం తాలు, తరుగు పేరుతో రైతులను దోచుకున్నారు. కానీ మేం అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

2 లో



# ఆ సస్పెన్షన్ ఎత్తివేయండి..

## స్పీకర్‌కు బీఆర్ఎస్ వినతి

2 లో

## సీఎం ప్రసంగం బహిష్కరణ

2 లో

### సభ నుంచి బిఆర్ఎస్ సభ్యుల వాక్ అవుట్

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు మంత్రి హెచ్చరిక

2 లో

## రేషన్‌కార్డుల జారీ మరింత ఆలస్యం.. టెండర్లు పూర్తయ్యేదెప్పుడో..



2 లో

# ఉత్తమ్ ద్రోహ చరిత్ర వల్లే..

## రేవంత్ కృష్ణా జలాల విమర్శలకు హరీష్ కౌంటర్

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అనుచితం
- కృష్ణా జలాల అన్యాయానికి కారణం ఉత్తమ్ ద్రోహం
- సీఎం ప్రసంగాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ నేతలు
- కేసీఆర్ త్యాగం Vs ఉత్తమ్ ద్రోహం
- సీతారామ ప్రాజెక్ట్ వల్లే ఖమ్మం రైతులకు రక్షణ: హరీష్




2 లో

ప్రాణాలను పణంగా పెట్టి కేసీఆర్ తెలంగాణ సాధిస్తే.. సంస్కారం లేకుండా సీఎం రేవంత్ మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ ప్రసంగాన్ని బహిష్కరించిన అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారాయన.

"కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మేం సీఎం ప్రసంగాన్ని బహిష్కరించి సభ నుంచి బయటకు వచ్చేశాం. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణను కేసీఆర్ సాధించారు. కానీ, సీఎం అనే విజ్ఞత కోల్పోయి, సంస్కారం లేకుండా రేవంత్ వ్యాఖ్యలు చేశారు. ఆఖరికి.. ఆ వ్యాఖ్యలపై సభలో మాట్లాడామన్నా మాకు స్పీకర్ మైక్ ఇవ్వలేదు" అని హరీష్ అన్నారు.

## నేటిమాట

"మీరు చేసే పనిలో మీరు ఏవిధంగా ఉంటారో, అది మీ నిజమైన గుర్తింపు."



ఆబ్రహామ్ లింకన్

# కాంగ్రెస్ 15 నెలల పాలనలో

## ఊదు గాలింది లేదు.. పీరు లేసింది లేదు : కేటీఆర్



2 లో

ఇది ప్రజాపాలన కాదని ప్రజలను వేధించే పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాలన దేశ రాజకీయ చరిత్రలోనే మాయని మచ్చ అంటూ దుయ్యబట్టారు. ఆర్థిక పరిస్థితి మాకెందుకు తెలియదు, హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు.. సంపద సృష్టిస్తాం, ప్రజలకు పంచుతాం అని ప్రగల్భాలు పలికారు. కానీ 15 నెలల పాలనలో ఊదు గాలింది లేదు.. పీరు లేసింది లేదని ధ్వజమెత్తారు. సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ 420 హామీలను చూసి మోసపోయాయని ఎక్స్ వేదికగా విమర్శించారు.

'ఆర్థిక పరిస్థితి మాకెందుకు తెలియదు .. హామీలన్నీ అమలు చేస్తాం అన్నారు. సంపద సృష్టిస్తాం, ప్రజలకు పంచుతాం అని ప్రగల్భాలు పలికారు. 15 నెలల పాలనలో ఊదు గాలింది లేదు.. పీరు లేసింది లేదు. సగటున నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున రూ.లక్ష 50 వేల కోట్లు అప్పు తెచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా ఒప్పుకుంది.

# కొందరు ఫాల్తుగాళ్లు

## మా పార్టీ నుంచి పోతే.. అధికారం మాదే

### రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

ఓవైసీ బ్రదర్స్ పైన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర విమర్శలు చేశారు. పవిత్రమైన రంజాన్ మాసాన హిందువులపై ఓవైసీ సోదరులు విషం కక్కుతున్నారని ఫైరయ్యారు. ఓవైసీ ఓ మెంటల్ గాడు అంటూ ఓ రేంజ్‌లో విరుచుకపడ్డారు. సొంత పార్టీ నేతలపై కూడా రాజాసింగ్ మరోసారి రెచ్చిపోయారు. 'కొంతమంది ఫాల్తు గాళ్లు మా పార్టీ నుంచి వెళ్లిపోతే తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది.



2 లో

## మాదే తప్పు అయితే క్షమాపణ చెప్తా.. కేసీఆర్‌కు రేవంత్ సవాల్

మొదటి పేజీ తరువాయి

రైతుల ఆత్మహత్యలకు అప్పులే కారణం. అవమానాలు భరించలేకనే రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. రుణాల నుంచి రైతులను విముక్తి చేయాలని నిర్ణయించాం. వాస్తవాల మీద ప్రభుత్వాన్ని నడపాలని చూస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశాం. రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. రైతులు ఆత్మగౌరవంతో బతకాలన్నదే మా విధానం. గతంలో ఎన్నికప్పుడే రైతుబంధు అన్నదాత అకౌంట్లలో పడేది. మార్చి 31 నాటికి రైతులందరికీ రైతుభరోసా అందిస్తామన్నారు.

గతంలో ఎక్కడ పంట పండినా కాళేశ్వరం వల్లే అని చెప్పుకున్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత 260 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను పండించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేసింది. గతంలో కేసీఆర్ వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని అన్నారు. కానీ, మేము అధికారంలోకి వచ్చాక రైతులను వరి పండిచాలని కోరాం.

కేసీఆర్ హయాంలోనే కృష్ణా బేసిన్ జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగింది. కృష్ణా నీటి విషయంలో కేసీఆర్ సంతకం చేసి తెలంగాణకు మరణశాసనం రాశారు. మా తప్పు ఉందని నిరూపిస్తే సభ సాక్షిగా కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నేతలకు క్షమాపణ చెబుతాను. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడే కృష్ణా జలాలపై చర్చ పెడతాం. లెక్కలతో సహా నిరూపిస్తాను.. చర్చకు సిద్ధమా? అని సవాల్ చేశారు.

గల్లీ నుంచి ఢిల్లీ వరకు నీటి కోసం పోరాటం చేస్తున్నాం. నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే కేసీఆర్ సభకు రాకుండా మొహం చాటేశారు. కమీషన్ల కోసమే జూరాల నుంచి తీసుకోవాల్సిన నీళ్లను శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకుంటామన్నది నిజం కాదా?. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్న పెంచితే తెలంగాణ ఎడారి అవుతుందని పీజేఆర్ అడ్డుకున్నారు. గతంలో ఎక్కడ పంట పండినా కాళేశ్వరం వల్లే అని చెప్పుకున్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత 260 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను పండించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేసింది. గతంలో కేసీఆర్ వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని అన్నారు. కానీ, మేము అధికారంలోకి వచ్చాక రైతులను వరి పండిచాలని కోరాం.

కవిత ఓడిపోతే ఎమ్మెల్సీ ఇచ్చారు.. సంతోష్‌కు రాజ్యసభ ఇవ్వలేదా?. మీ ఇంట్లో అందరికీ ఉద్యోగ అవకాశాలిచ్చారు.. పదేళ్లు ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు?. మీరు ఇచ్చిన నోటిఫికేషన్లు తక్కువ, పెట్టిన పరీక్షలు ఎక్కువ. పరీక్ష పేపర్లను పల్లీ బఠానీల్లా అమ్మేశారు. గత ప్రభుత్వంలో పరీక్షా పత్రాలను జిరాక్స్ సెంటర్‌లలో అమ్మేసింది. టీఎస్‌పీఎస్సీ ప్రతిష్టను దిగజారిస్తే మేం ప్రక్షాళన చేశాం. ఒక్క ఏడాదిలోనే 57,924 ఉద్యోగాలు ఇచ్చాం. 19 శాతం నిరుద్యోగాన్ని తగ్గించిన ఘనత మాది. విద్యాశాఖను మేం ప్రక్షాళన చేశాం. 20 ఏళ్లు ప్రమోషన్, 10 ఏళ్లు ట్రాన్స్‌ఫర్ లేని వారికి శుభవార్త అందించాం. చిన్న వివాదం కూడా లేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం. గ్రూప్-2,3,4 పరీక్షల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేశాం' అని తెలిపారు.

## కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్సీలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారు.


మొదటి పేజీ తరువాయి

బోనస్ బోగస్‌గా మారిపోయింది.. మహాలక్ష్మిని పాక్షికంగా మాత్రమే అమలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. మహిళలకు 2,500లు తక్షణమే చెల్లించాలి.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూది లేదు. దూది లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ రిపోర్ట్ పూర్తిగా టేబుల్ చేయాలి.. పరిశ్రమలు రాష్ట్రం వదిలిపోతున్నట్లు ప్రచారం జరుగుతుంది.. గతంలో ఉన్న పరిశ్రమలు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. హైడ్రాతో నిరంతరం విధ్వంసం చేస్తున్నారని అన్నారు.

మండలిలో కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్సీలు పదే పదే అబద్ధాలు చెబుతున్నారు.. దీని గుర్తించి తమ ఎమ్మెల్సీలు అడ్డుకునే ప్రయత్నం చేస్తే చైర్మన్ న్యూసెన్స్ చేయవద్దని కామెంట్ చేశారు. మండలి చైర్మన్‌గా న్యూసెన్స్ అనే పదం వాడారు.. దాన్ని రికార్డుల్లో నుంచి తొలగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. గతంలో కూడా తమ సభ్యులపై ఏకవచనంతో మాట్లాడారు.. శాసనసభలో, మండలిలో బీఆర్ఎస్ సభ్యులకు సముచిత స్థానం కల్పించడం లేదని తెలిపారు. అసెంబ్లీలో తమ సభ్యులను సస్పెండ్ చేయడం.. మండలిలో తమ మీద అన్ పార్లమెంటరి వర్డ్స్ వాడటం చుస్తే ప్రభుత్వం కక్షపురితంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం అవుతుందని కవిత పేర్కొన్నారు. మరోవైపు.. ముఖ్యమంత్రికి తెలంగాణ ఉద్యమంలో పాత్ర లేదు.. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలు తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా ఉంటున్నాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ముస్లిం, లంబాడా వారికి చోటు దక్కలేదని కవిత ఆరోపించారు.

## పనులు చేయకుండా ప్రచారం చేసుకోలేదు...పల్లాపై డిప్యూటీ సీఎం భట్టి ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణ ప్రభుత్వం తాము చేసిన పనులను లెక్కలతో చూపిస్తుందని, బీఆర్ఎస్‌లా పనులు చేయకుండా ప్రచారం చేసుకోవాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.



బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరేళ్లు పెండింగ్‌లో పెట్టిన రైతు రుణమాఫీని తాము మూడునెలల్లోనే పూర్తిచేశామని తెలిపారు.

జనగామలో బీఆర్ఎస్ రూ.124 కోట్లు రుణమాఫీ చేస్తే, తాము రూ.263 కోట్లు మాఫీ చేశామని వివరించారు.

గజ్వేల్‌లో రూ.104.3 కోట్ల రుణమాఫీ బీఆర్ఎస్ చేస్తే, తాము రూ.237.33 కోట్ల మాఫీ చేశామని తెలిపారు.

సిద్దిపేటలో బీఆర్ఎస్ రూ.96.62 కోట్లు రుణమాఫీ చేయగా, తాము రూ.177.91 కోట్లు మాఫీ చేశామని చెప్పారు.

సిరిసిల్లలో రూ.101.76 కోట్ల రుణమాఫీ బీఆర్ఎస్ చేస్తే, తాము రూ.175.84 కోట్లు మాఫీ చేశామని వివరించారు.

ప్రతి సంక్షేమ పథకానికి లెక్కలతో కూడిన సమాచారం ఎమ్మెల్యేలకు అందజేసి, గ్రామాల వారీగా ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు.

రైతు రుణమాఫీతో పాటు, సన్నాలకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

యూనివర్సిటీల అభివృద్ధికి తాము చర్యలు తీసుకున్నామని, 12 మంది వీసీలను నియమించామని తెలిపారు.

ఉస్మానియా యూనివర్సిటీలో తొలిసారి దళిత వీసీని నియమించామని చెప్పారు.

నగరంలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి, రూ.15 కోట్లు విడుదల చేశామని తెలిపారు.

కొత్త భవనాల నిర్మాణానికి రూ.540 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.

ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్

20 ఎకరాల్లో డిజిటల్ బోర్డులు, క్రీడా మైదానాలతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామని తెలిపారు.

పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు 65 ITIలను ఆధునిక టెక్నాలజీ కేంద్రాలుగా మారుస్తున్నామని చెప్పారు.

విద్యాశాఖ అభివృద్ధిపై భట్టి స్పందన

సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు.

11,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించామని, మరో 6,000 పోస్టుల కోసం కృషి చేస్తున్నామని వివరించారు.

22,000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, 36,000 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశామని చెప్పారు.

బీఆర్ఎస్ నేతల లక్ష్యం ప్రజలకు మేలు చేయడం కాదని, ప్రభుత్వ ఖజానాను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడమేనని ధ్వజమెత్తారు.

ప్రతి పైసా ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## కెసిఆర్ నిండు నూరేళ్లు మంచిగుండాలే: సీఎం రేవంత్ రెడ్డి

'కాంగ్రెస్ విధానాలే గవర్నర్ ప్రసంగలో ఉంటాయి. స్టేచర్ పై మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉన్నా. రైతుల ఆత్మహత్యకు ప్రధాన కారణం వారి అప్పులే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేసి చూపించాం. మేం అధికారం లోకి వచ్చిన ఏడాదిలో రుణమాఫీ చేశాం. ఎన్నికల కోడ్ సాకుతో కేసీఆర్ రైతుబంధు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక అది కూడా చెల్లించాం. భూమి లేని కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నాం. రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇచ్చే పథకం తీసుకొచ్చాం' అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## ఉత్తమ్ ద్రోహ చరిత్ర వల్లే.. రేవంత్ కృష్ణా జలాల విమర్శలకు హరీష్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన ద్రోహం వల్లే తెలంగాణకు కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందని హరీష్ ఆరోపించారు. ఈ తప్పు ముమ్మాటికీ కాంగ్రెస్‌దే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ వల్ల నిర్లక్ష్యం జరిగింది. అప్పటి లెక్కల ప్రకారం నీళ్లు, ప్రాజెక్టులు ఉన్నాయి. అప్పటి లెక్కల ప్రకారం నీళ్ల పంపకాలు జరిగాయి.

ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆనాడు మంత్రి పదవి కోసం తెలంగాణ కోసం మాట్లాడలేదు. పోతిరెడ్డిపాడు కోసం 40 రోజులు పీజేఆర్ తప్ప ఎవరూ పోరాడలేదు. ఆ సమయంలో ఉత్తమ్ మౌనంగా ఉండిపోయారు. .. తెలంగాణకు ద్రోహం చేసి పోతిరెడ్డిపాడుపై పెదవులు మూసుకున్నందుకే ఉత్తమ్‌కు మంత్రి పదవి వచ్చింది. విజయవాడలో ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు చంద్రబాబు ఇంట్లో భోజనం చేశారు. ఆపై శ్రీశైలం ఖాళీ అయ్యే వరకు చూశారు.

సెక్షన్-3 తెచ్చి తెలంగాణకు న్యాయం చేసింది కేసీఆర్. ద్రోహ చరిత్ర ఉత్తమ్ కుమార్ రెడ్డిది.. త్యాగ చరిత్ర మాది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను మేము వ్యతిరేకించాం. నీళ్లు ఉన్నా ఖమ్మం, నల్గొండ లో పంటలు ఎండిపోయాయి ఎందుకు?. కేసీఆర్ కట్టిన సీతారామ పుణ్యమాని ఖమ్మం పంటలు కాపాడుకుంటున్నారు.

## ఆ సస్పెన్షన్ ఎత్తివేయండి.. స్పీకర్‌కు బీఆర్ఎస్ వినతి

మూడో రోజు అసెంబ్లీ సమావేశాలు మొదలవగానే బీఆర్ఎస్ సభ్యులు ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సస్పెన్షన్ అంశాన్ని లేవనెత్తారు. జగదీష్ రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, ఈ అంశాన్ని స్పీకర్ పునఃపరిశీలించాలని మాజీ మంత్రి హరీష్ రావు విజ్ఞప్తి చేశారు. జగదీష్ రెడ్డి తమను ఉద్దేశించి ఏకవచనంతో మాట్లాడలేదని స్పీకర్‌తో అన్నారు.

స్పీకర్ అంటే తమకు గౌరవం ఉందని, జగదీష్ రెడ్డికి మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని హరీష్‌రావు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అంతకుముందు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ శాసనసభాపక్షం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆయనను స్పీకర్ చాంబర్‌లో కలిసి వినతిపత్రం అదించింది. స్పీకర్ పట్ల జగదీష్ రెడ్డి అమర్యాదగా ప్రవర్తించలేదని, సస్పెన్షన్‌పై ఫ్లోర్ లీడర్ల అభిప్రాయం కానీ, బీఆర్ఎస్ పార్టీ వివరణ కానీ, జగదీష్ రెడ్డి వివరణ గానీ తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని తెలిపింది.

## కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఊదు గాలింది లేదు.. పీరు లేసింది లేదు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

రుణమాఫీ కాలేదు, రైతుభరోసా రాలేదు, రైతుబీమా ప్రీమియం కట్టలేదు, సాగునీళ్లు రాలేదు, పంటల కొనుగోళ్లు జరగడం లేదు, రూ.500 క్వింటాలు ధాన్యానికి బోనస్ ఇవ్వడం లేదు. కేసీఆర్ కిట్ ఆగింది, న్యూట్రిషన్ కిట్ మాయమైంది, దవాఖానాల్లో మందులు లేవు, వరంగల్ దవాఖాన నిర్మాణం నిలిపేశారు, TIMS దవాఖానల నిర్మాణం ఆపేశారు.

కాళేశ్వరం మరమ్మతులు చేయకుండా.. రైతులకు సాగునీళ్లు ఇవ్వకుండా కన్నీరు పెట్టిస్తున్నారు. పాలమూరు రంగారెడ్డి పనులు పడావు పెట్టారు. గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందక విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు.. విషాహారం తిని ప్రాణాలు తీసుకుంటున్నారు. దొంగలు, దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు.. తెచ్చిన అప్పులను 20 శాతం కమీషన్లు దండుకుని బిల్లులు చెల్లిస్తున్నారు. కాంగ్రెస్ పాలన దేశ రాజకీయ చరిత్రలోనే మాయని మచ్చ. రైతులు, రైతుకూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, ప్రజలు, సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ 420 హామీలను చూసి మోసపోయాయి. ఇది ప్రజాపాలన కాదు. ప్రజలను వేధించే పాలన" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## బెట్టింగ్ నివారణ ఉద్యమంలో చేరండి నెటిజన్లకు సజ్జనార్ పిలుపు!



యువత ప్రాణాలు బలి తీసుకుంటున్న బెట్టింగ్ యాప్స్ కు వ్యతిరేకంగా పోరాడుతున్న ఐపీఎస్ అధికారి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్.. తన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. బెట్టింగ్ యాప్స్ వ్యతిరేక ఉద్యమంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. బెట్టింగ్ భూతాన్ని శాశ్వతంగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు నడుంబిగించాలని కోరారు.

బెట్టింగ్ యాప్స్ పై సజ్జనార్ సీరియస్

గత కొద్ది నెలలుగా బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చాలా మంది యువత ఈ యాప్స్ కు ఊబిలో చిక్కుకుని అప్పుల్లో కూరుకుపోతున్నారు. మరికొంత మంది లోన్స్ యాప్స్ ద్వారా అప్పు చేసి మరీ ఈ గేమ్స్ ఆడుతున్నారు. చివరకు ఉన్నడబ్బులన్నీ కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. అప్పులు తీర్చే మార్గం కనిపించక పలువురు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అయితే, ఈ దుర్మార్గపు యాప్స్ ను పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రమోట్ చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కూడా ఈ యాప్స్ ప్రమోషన్స్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక యువతను బెట్టింగ్ భూతం వైపు ఆకర్షించేలా చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయన సూచన మేరకు రీసెంట్ గా యూట్యూబర్స్ లోకల్ బాయ్ నాని, భయ్యా సన్నీ యాదవ్ సహా పలువురిపై కేసులు నమోదయ్యాయి.

హర్ష సాయిపై సజ్జనార్ తీవ్ర ఆగ్రహం

అటు తాజాగా యూట్యూబర్ హర్ష సాయి పైనా సజ్జనార్ సీరియస్ గా స్పందించారు. హర్ష సాయికి సంబంధించిన ఓ వీడియోను తాజాగా షేర్ చేశారు. ఇందులో హర్ష బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు అనుకూలంగా మాట్లాడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "చేస్తున్నదే తప్పు.. అదేదో సంఘసేవ చేస్తున్నట్టు ఎంత గొప్పలు చెప్పుకుంటున్నాడో చూడండి. తాను బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయకుంటే ఎవరో ఒకరు చేస్తారని ఈయన చేస్తున్నాడట. బుద్దుందా అసలు! ఎంతో మంది అమాయకుల ప్రాణాలు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలైతుంటే కనీసం పశ్చాత్తాపం లేదు. వీళ్లకు డబ్బే ముఖ్యం, డబ్బే సర్వస్వం.. ఎవరూ ఎక్కడ పోయినా, సమాజం, బంధాలు, బంధుత్వాలు చిన్నాభిన్నమైన సంబంధం లేదు. ఈయనకు 100 కోట్ల నుంచి 500 కోట్ల వరకు ఆఫర్ చేశారట. అంతగనం డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో ఆలోచించండి. మీ ఫాలోయింగ్ ని మార్కెట్‌లో పెట్టి కోట్లకు కోట్లు సంపాదిస్తున్న ఇలాంటి వాళ్లనా.. మీరు ఫాలో అవుతోంది. వెంటనే ఈ బెట్టింగ్ ఇన్‌ఫ్లూయెన్సర్లను అన్‌ఫాలో చేయండి. వారి అకౌంట్లను రిపోర్ట్ కొట్టండి. ఆన్‌లైన్ బెట్టింగ్ భూతాన్ని అంతమొందించడంలో మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి" అని పిలుపునిచ్చారు.

## కొందరు ఫాల్తుగాళ్లు మా పార్టీ నుంచి పోతే.. అధికారం మాదే: రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

ఓవైసీ బ్రదర్స్ పైన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర విమర్శలు చేశారు. పవిత్రమైన రంజాన్ మాసాన హిందువులపై ఓవైసీ సోదరులు విషం కక్కుతున్నారని ఫైరయ్యారు. ఓవైసీ ఓ మెంటల్ గాడు అంటూ ఓ రేంజ్ లో విరుచుకపడ్డారు. సొంత పార్టీ నేతలపై కూడా రాజాసింగ్ మరోసారి రెచ్చిపోయారు. 'కొంతమంది ఫాల్తూ గాళ్లు మా పార్టీ నుంచి వెళ్లిపోతే తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది. అప్పుడు రాష్ట్రం నుంచి పారిపోయే మొదటి వ్యక్తి ఓవైసీనే. అసదుద్దీన్ ఒవైసీకి మెంటల్ వచ్చింది.. ఆయనకు ట్రీట్మెంట్ ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నా' అని రాజాసింగ్ ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో కమలం పార్టీ అధికారంలోకి రాగానే ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దేశం వదిలిపోయేలా చేస్తామని ఎమ్మెల్యే రాజా సింగ్ వార్నింగ్ ఇచ్చారు. లేదా తాను బీజేపీలో జాయిన్ అవుతానని అసదుద్దీన్ ఒవైసీ తమ నేతల కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు. అప్పుడు మేం వదిలేస్తామని చెప్పుకొచ్చారు. పవిత్రమైన రంజాన్ పండగ సందర్బంగా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ లేనిపోని కామెంట్స్ చేస్తున్నారని రాజాసింగ్ ఫైరయ్యారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా జమ్మికి నమాజ్ చేస్తే బాగుంటుంది అన్న యోగి ఆదిత్యనాథ్ మాటలకు అసదుద్దీన్ ఓవైసీకి రాజాసింగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో హోలీ పండగ ప్రశాంతంగా జరగకూడదని అసద్దుద్దీన్ ఒవైసీ కుట్ర చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో లేనిపోని అల్లర్లు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని అసదుద్దీన్ ఒవైసీ కుట్ర చేశారని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు.

## నా ఫొటోలు మార్ఫింగ్ చేశారు.. ఇక వదిలేది లేదంటూ మంత్రి మాస్ వార్నింగ్..

మొదటి పేజీ తరువాయి

బాడీ షేమింగ్, ఫొటోలు మార్ఫింగ్, అనని మాటలు అన్నట్లుగా చూపిస్తున్నారని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారం చేపటిన నాటి నుంచి మాపై ఈ దాడులు మరీ ఎక్కువైపోయాయంటూ ఆరోపించారు. అన్నాచెల్లెళ్లు చేతిలో చెయ్యి వేసుకున్నా మరోరకంగా చూపుతున్నారని మంత్రి మండిపడ్డారు. సోషల్ మీడియాను మంచికి వాడాలే తప్ప చెడుకు కాదంటూ హితవు పలికారు. అబద్ధాలపైనే బీఆర్ఎస్ నడుస్తోందని, ఏ రోజుకైనా నిజమే గెలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా బురద చల్లుతున్నారని, కడుక్కోవడం తమ వంతు అవుతోందంటూ మంత్రి సీతక్క చెప్పారు.

## సీఎం ప్రసంగం బహిష్కరణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై సీఎం సమాధానం ఇస్తుండగా బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావును కోరుకున్న నాయకుడి ప్రసంగాన్ని తాము బహిష్కరిస్తున్నామని వాకౌట్‌కు ముందు ప్రకటించారు.

బీఆర్ఎస్ పార్టీ స్ట్రెచర్ మీది నుంచి మార్చురీకే అని వ్యాఖ్యానించడం, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, 10 ఏండ్లు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిన పాలనాదక్షుడు అయిన కేసీఆర్ చావును కోరుకోవడం అంటే.. తెలంగాణకు కీడును కోరుకోవడమే అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా తాము సీఎం ప్రసంగాన్ని బహిష్కరిస్తున్నామని చెప్పారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు మంత్రి హెచ్చరిక




తెలంగాణ శాసనమండలి లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలకు బీఆర్ఎస్ భయపడుతుందని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన తప్పులు ప్రజలకు తెలుస్తాయని.. వాస్తవాలను దాచిపెట్టాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డిని మండలిలో మాట్లాడనివ్వడం లేదని మండిపడ్డారు. నిజాలు వినకుండా.. ఏ విధంగా తప్పించుకోవాలని వారు ప్రయత్నం చేస్తున్నారో ప్రజలంతా గమనించాలని కోరారు. సభా సాంప్రదాయాలకు విరుద్ధంగా సభ్యులు ప్రవర్తించడం మంచిది కాదని అన్నారు. నిరసన తెలుపాలంటే వాకౌట్ చేసి పోవాలి.. కానీ ఇక్కడే అరుస్తూ నినాదాలు చేయడం కరెక్ట్ కాదు.. ఇకనైనా బీఆర్ఎస్ సభ్యులు తమ వైఖరిని మార్చుకోవాలని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు.

## రేషన్‌కార్డుల జారీ మరింత ఆలస్యం.. టెండర్లు పూర్తయ్యేదెప్పుడో.. కార్డులు తయారయ్యేదెప్పుడో

రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది. ఈ నెలలోనే కొత్తకార్డులు జారీచేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. క్యూఆర్ కోడ్‌తో కూడి న కొత్త కార్డుల ముద్రణ కోసం పౌరసరఫరాల శాఖ బుధవారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 25 వరకు దరఖాస్తులకు అవకాశం ఇచ్చింది. దీంతో టెండర్లు పూర్తయ్యేదెప్పుడు, కొత్త కార్డులు ముద్రణ ప్రారంభమయ్యేదెప్పుడు, వాటిని లబ్ధిదారులకు ఇచ్చేదెప్పుడు అనే ప్రశ్న లు వ్యక్తమవుతున్నాయి. టెండర్ తేదీలను పరిశీలిస్తే ఈ నెలలో కొత్త కార్డులు వచ్చే అవకాశం లేదు. ఏప్రిల్‌లో అయినా కార్డులు సిద్ధమవుతాయో లేదో తెలియడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొత్త కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చింది. 15 నెలలు గడుస్తు న్నా ఇప్పటివరకు ఒక్క కార్డు కూడా ఇవ్వలేదు. జనవరి 26న కొత్త రేషన్‌కార్డుల జారీని సీఎం రేవంత్ ప్రారంభించారు. అంతకుముందు గ్రామ సభలు నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. లబ్ధిదారుల ను కూడా ఎంపిక చేసినట్టు ప్రకటించింది. ఇక రేషన్‌కార్డులు రావడమే ఆలస్యమనే ఆలోచనలో ప్రజలున్నా రు. తీరా మళ్లీ మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలంటూ మరో మెలిక పెట్టింది. నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకున్న ప్రభుత్వం కార్డులను మాత్రం జారీ చేయలేకపోయింది. తీరా ఇప్పుడు స్మార్ట్‌కార్డుల పేరుతో ప్రభుత్వం కొత్త పాట పాడుతున్నది. దీంతో రేషన్‌కార్డుల జారీని మరింత ఆలస్యం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందేమో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఏ ఒక్క గ్రామంలో 100 శాతం రుణమాఫీ అయినా ముక్కు నేలకు రాస్తా : ఎమ్మెల్యే పల్లా



ఈ ప్రభుత్వం రైతు రుణమాఫీపై అబద్ధాలు చెబుతోందని జనగామ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అక్కడ 100 శాతం రుణమాఫీ చేసినం, ఇక్కడ 100 శాతం రుణమాఫీ చేసినం అని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని, తన జనగామ నియోజకవర్గంలో మాత్రం ఎక్కడా 100 శాతం రుణమాఫీ కాలేదని చెప్పారు. తన నియోజకవర్గంలో మొత్తం 127 గ్రామాలు ఉన్నాయని, ఆ 127 గ్రామాల్లో ఏ ఒక్క గ్రామంలో 100 శాతం రుణమాఫీ కాలేదని అన్నారు. తన నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో అయినా సరే 100 శాతం రుణమాఫీ జరిగినట్లుగా ప్రభుత్వం నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి శపథం చేశారు. అంతేకాదు తాను తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని అన్నారు. వంద శాతం రుణమాఫీ చేశామని అబద్ధాలు చెప్పకుండా.. ఇంకా రుణాలు మాఫీ కాని రైతులకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యాశాఖలో డ్రాపౌట్స్ పెరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో 2 లక్షల డ్రాపౌట్స్ నమోదయ్యాయని చెప్పారు. విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

KR TV క్రాంతి
తెలంగాణ
epaper.krtvnews.com

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను కలిసిన డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ల



మోత్కూర్ 15మార్చ్ (క్రాంతి న్యూస్): తాజాగా ఎమ్మెల్సీగా ఎన్నికైన అద్దంకి దయాకర్‌ను కాంగ్రెస్ యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో మోత్కూరు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం, హైదరాబాద్‌లోని అద్దంకి దయాకర్ నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే, ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, సుదగాని యాదగిరి, కొప్పుల కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆత్మకూర్ ఎం వద్ద రోడ్డు ప్రమాదం

### ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి





మోత్కూర్ 15మార్చ్ ( క్రాంతి న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్ ఎం మండల కేంద్రంలోని రాయగిరి – మోత్కూరు ప్రధాన రహదారిపై తిమ్మాపురం ఎక్స్ రోడ్ వద్ద, శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికుల సమాచారం ప్రకారం, హైదరాబాద్‌కు హెచ్‌వైడి 2 డిపో కు చెందిన, ఆర్టీసీ బస్సు మహబూబాబాద్ వెళుతుండగా, యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం తిమ్మాపురం ఎక్స్ రోడ్ వద్ద, బైక్ పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన చామల రమేష్ (35) తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు రమేష్‌ను భువనగిరి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి 108 లో తరలించారు. గాయాలతో ఆసుపత్రికి చేరుకున్న రమేష్ ను ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించినట్లు సమాచారం. గాయాల తీవ్రత కారణంగా మార్గమధ్యంలోనే రమేష్ ప్రాణాలు కోల్పోయాడని తెలిసింది. రమేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలు చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

## పాలడుగులో భక్తిశ్రద్ధలతో బొడ్రాయి అమ్మవారి తృతీయ వార్షికోత్సవం



మోత్కూర్ 15మార్చ్ (క్రాంతిన్యూస్ ): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో బొడ్రాయి అమ్మవారి తృతీయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవతలు మన సంప్రదాయానికి, సంస్కృతికి ప్రతీకలని అన్నారు వారితో పాటు బి.ఆర్.యస్ మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు పొన్నబోయిన రమేష్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, పాలడుగు గ్రామశాఖ అధ్యక్షులు మర్రిపల్లి చంద్రయ్య గ్రామ మాజీ సర్పంచ్ మర్రిపల్లి యాదయ్య బి.ఆర్.యస్ నాయకులు బోడిగే వీరయ్య. బోడిగే మచ్చగిరి.సింగిరెడ్డి నరసింహారెడ్డి.కొంపెల్లి అంజయ్య.మర్రిపల్లి శేఖర్. రాజు.రమేష్.మల్లేష్. బి.మల్లేష్ తదితరులు. పాల్గొన్నారు.

## యువత మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దు

వెంకటాపూర్ , మార్చి 15 (క్రాంతిన్యూస్ ) : ప్రస్తుత సమాజంలో యువత సన్మార్గంలో నడుచుకోవాలని మత్తు పదార్థాలకు బానిస కావద్దని ములుగు డిఎస్పి రవీందర్ పిలుపునిచ్చారు. మండలంలోని పాత నేరస్తులతో పాటు అనుమానిత వ్యక్తులకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ములుగు డిఎస్పి రవీందర్ హాజరై వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్పి రవీందర్ మాట్లాడుతూ... యువత పెడదారిన వెళ్లొద్దని అన్నారు. ఉన్నత చదువు చదువుకొని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. సమాజానికి హాని చేసే మాదక ద్రవ్యాల నిర్మూలనకు మండలంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గంజాయి రహిత మండలంగా వెంకటాపూర్ ను తయారు చేసుకోవాలని అన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సహకారంతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలం లోని అన్ని గ్రామాల్లో మత్తు పదార్థాల నిర్మూలనకు "యాంటీ డ్రగ్స్ వారియర్స్"పేరు తో కమిటీలు సైతం ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు హాని కలిగించే గంజాయి తో పాటు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా గురించి తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మండలం లోని పాత నేరస్థుల పై, సస్పెక్టెడ్ వ్యక్తులపై ఎప్పుడు నిఘా ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా మండలం లో యాంటీ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందలతో తనిఖీలు చేయడం జరుగుతుందని వెల్లడించారు. మండలంలో మత్తు పదార్థాల నివారణకు వెంకటాపూర్ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని డిఎస్పి కొనియాడారు.



## మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం



హుస్నాబాద్, మార్చి 15 (క్రాంతిన్యూస్ ) :సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ పాలకవర్గం పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ పొద్దు తిరుగుడుకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్నదని బయట అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వ్యవసాయ అధికారి సబిహా కాంగ్రెస్ నాయకులు డైరెక్టర్లు వెంకటస్వామి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారం మండల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసిన జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య



ధర్మారం, మార్చ్ 15 (పబ్లిక్ న్యూస్ ) : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఎల్ఆర్ఎస్ ఫీజు పేమెంట్స్ పై ధర్మారం గ్రామ పంచాయతీలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు కలిగి ఉన్న పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఫీజు చెల్లింపు లో తీసుకోవాల్సిన చర్యలు మరియు జాగ్రత్తలపై ప్రజలకు ఏ విధంగా అవగాహనా కల్పించాలో తెలిపినారు. ఇట్టి సమావేశములో ధర్మారం మండల పంచాయతీ అధికారి , పంచాయతీ కార్యదర్శులు పాల్గొనడం జరిగినది. మరియు మండల కేంద్రములోని మిని గురుకులం వసతి గృహమును సందర్శించి పిల్లల భోజనం మరియు ఆహార నాణ్యతను పరిశీలించి, నూతన డైనింగ్ హాల్ యొక్క నిర్మాణ పనులను పర్యవేక్షించినారు. ఇట్టి మిని గురుకులం పరిశీలనలో కె.రమేష్ ఎంపీఓ , రాజమౌళి డిఈ మరియు ఏ.రాజశేఖరం ఏఈ తదితరులు పాల్గొనడం జరిగినది

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏఐ బోధన.

**విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల సాధన కోసం.**
**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులకు పాఠ్యలు లు బోధించాలి.**
**జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి**



చెన్నరావుపేట, మార్చ్ 15 (క్రాంతిన్యూస్ ) :ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏఐ బోధన విద్యార్థుల సామర్థ్యాల సాధన కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి సూచించారు మండలంలోని జల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా కలెక్టర్ హాజరై ఏ ఐ ఆర్టీఫిజీషియన్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ పరిజ్ఞానం కోసం విద్యార్థులకు కంప్యూటర్లను ప్రారంభించినారు. మండలం లోని జల్లి, పాపయ్యపేట,లింగాపురం ప్రాథమిక పాఠశాలలో ఈ కృత్రిమమేధ ప్రోగ్రాం ను ప్రారంభించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యం లలో వెనుకబడిన విద్యార్థులకు ఈ అరిఫిషియల్ ఇంటిలిజెన్స్ కార్యక్రమం బాగా ఉపయోగపడుతుందని కలెక్టర్ గారు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి విద్యార్థులు మంచి ఉత్తమమైన ఫలితాలను తీసుకురావాలని విద్యార్థులకు పలు సూచనలు అందించారు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట పాత్రలు శుభ్రంగా కడిగి వంట చేయాలని వంట వండే వంట కార్మికులకు సూచించారు బియ్యాన్ని శుభ్రంగా కడిగిన తర్వాతనే వంట పాత్రలో వేయాలని సూచించారు అలాగే అంగన్వాడి కేంద్రం సందర్శించి విద్యార్థులకు బాలింతలకు నాణ్యమైన సరుకులను అందించాలని గడువు తేది ముగిసిన పాల ప్యాకెట్స్ ను బాలింతలకు అందించరాదు జాగ్రత్తగా చూసుకొని చిన్నారులకు అందించాలని పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అనంతరం పాపాయిపేట లింగాపురం పాఠశాల లలో ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్, ఏ ఎం ఓ జిల్లా అధికారి ఉంద్రాతి సృజన్ తేజ, మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, మండల విద్యాశాఖ అధికారిని బైరి సరళ ,జిల్లా రిసోర్స్ పర్సన్ రాయపరెడ్డి, ఎంపీ ఓ శ్రీధర్ రాజు, ఏ ఎస్ ఐ లక్ష్మణమూర్తి ,జగన్మోహన్ ,ఈ ర్యా పాధ్యాయులు అంగన్వాడీ సిబ్బంది సీఆర్పీలు గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు

## దేశ స్వాతంత్ర కోసం పోరాడి ప్రాణాలర్పించిన యువకిశోరాల వర్ధంతి

**సభలను జయప్రదం చేయండి..- ఢీ వై ఎఫ్ ఐ , ఎస్ఎఫ్ఐ ..**




భద్రాద్రి కొత్తగూడెం , 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :దేశ స్వాతంత్రం కోసం 23 సంవత్సరాల వయసులో తన ప్రాణాన్ని ఉరి కొయ్యను ముద్దాడి వదిలిన భగత్ సింగ్ ఇంకా అతని మిత్రులు రాజ్ గురు, సూక్ దేవ్ వంటి యువకిషిరాలను స్మరించుకుంటూ వారి వర్ధంతి సభలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తూ ఉన్నామని వాటిలో విద్యార్థులు యువకులు భాగస్వాములు కావాలని ,జిల్లా కార్యదర్శులు కాళంగి హరికృష్ణ భయ్యా అభిమన్యు పిలుపునిచ్చారు .కొత్తగూడెం మంచి కంటి భవన్లో వర్ధంతి సభల గోడపత్రికలను స్థానిక మంచి కంటి భవన్లో ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ , నేటి యువత కూడా భారత దేశ స్వతంత్ర పోరాట స్ఫూర్తిని వారిలో ఇముడ్చుకొని, లౌకిక రాజ్యాంగ పరిరక్షణకై జరుగుతున్న పోరాటంలో భాగస్వామ్యులు కావాలని , మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని , మహిళలను కాపాడుకోవాలనీ,ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అరికడుతూ , అందరికీ విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు కల్పన కై నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ , ఎస్ఎఫ్ఐ పోరాటంలో యువత విద్యార్థులు భాగస్వాములు కావాలని , కోరారు. భారతదేశ స్వతంత్ర పోరాటంలో అసువులు బాసిన వారి స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేస్తూ , వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని, ఈనెల 15వ తారీకు నుండి 23వ తారీకు వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో చైతన్య సదస్సుల రూపంలో వారి వర్ధంతి సభలు జరుపుతున్నామని , అలాగే 23 వ తారీఖున జిల్లా కేంద్రంలో కాగడాల ప్రదర్శన భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతుందని,అన్ని మండల కేంద్రాలలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ,కావున భారతదేశ లౌకిక రాజ్యాంగ పరిరక్షణకే జరుగుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో దేశభక్తులు అందరూ అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు , ఈ కార్యక్రమంలో, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు ,మంద నాగకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాంచరణ్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు , సుధీర్, కుమార్, శశి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో ఏఐ విద్యను ప్రారంబించిన మండల విద్యాధికారి పోతు ప్రభాకర్

ధర్మారం, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : నర్సింహులపల్లి, కొత్తూరు ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ విద్యను ప్రారంభించిన ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు పొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సాయంతో విద్యను అందించేలా ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం పైలట్ ప్రాజెక్టుగా పెద్దపల్లి జిల్లాలోని 15 పాఠశాలలను ఎంపిక చేయగా ధర్మారం మండలం నుండి నర్సింహులపల్లి, కొత్తూరు ప్రాథమిక పాఠశాలలు ఇందులో చోటు దక్కింది.

శనివారం రోజున మండల విద్యాధికారి పి.ప్రభాకర్ నర్సింహులపల్లి, కొత్తూరు హైస్కూల్ ఆవరణలో ఏఐ చదువుల కొరకు కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహులపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఇఓ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రాథమిక పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా విద్యాశాఖ ఏఐ సాయంతో విద్యాబోధన చేసేందుకు కార్యాచరణ రూపొందించిందని, దీని ద్వారా విద్యార్థులు భాషపై పట్టు సాధించి చదవడం, రాయడం నేర్చుకోవడమే కాకుండా, గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో కూడా నైపుణ్యం సాధిస్తారని, వారిలో సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. ప్రత్యేక సాఫ్ట్ వేర్ సాయంతో రూపొందించిన ఏఐ కార్యాచరణ పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తుందని అన్నారు. కాబట్టి పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో దొంగతుర్తి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఉన్నత మరియు ప్రాథమిక



పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రవీందర్, కె. సత్యం, సతీష్ కుమార్, చెన్నారెడ్డి, ఆనంద్, అమ్మ ఆదర్శకమిటీ చైర్ పర్సన్లు రజిత, లక్ష్మీ మరియు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రాంతి
ఆంధ్రప్రదేశ్
epaper.krtvnews.com

## మట్టి లారీ ఓవర్ స్పీడ్ వల్లే "మేరుగు కుమారస్వామి" దుర్మరణం

**బాదితునికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మెరుగు చంద్రయ్య కొల్లూరి మల్లేష్**



రామగుండం, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :మేరుగు కుమారస్వామి తండ్రి పెద్ద మల్లయ్య వయస్సు 42 సంవత్సరంల పెద్దంపేట గ్రామ నివాసి, యదివిదిగా ఉద్యోగ నిమిత్తం పాలకుర్తి మండలం వెళుతుండగా ఉ,,10.30 గంటల సుమారుకు బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్ దాటుతున్న సమయంలో లారీ ఓవర్ స్పీడ్తో గుద్ది వేయడం ద్వారానే బైక్, హెల్మెట్ పగిలి, తల చిట్లి పోయి చనిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తుందని, ఇలా చూస్తూ పోతే ఇంకా చాలా ప్రాణాలు గాలిలో కలిసిపోయే అవకాశం ఉందని, వెంటనే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి మట్టి, బూడిద, ఇసుక వాహనాల ఓవర్ స్పీడ్ నియంత్రించే ఏర్పాటు చేయాలని, అక్రమ దందాలను అరికట్టాలని దుయ్యబట్టారు, లేనిచో ప్రభుత్వ ఆఫీసుల ముందు ప్రజా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

## ఒక్క విద్యార్థి - ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు

భద్రాద్రి కొత్తగూడెం , 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, రుద్రంపూర్ గ్రామానికి చెందిన యువ ప్రతిభావంతుడు మొహమ్మద్ హఫ్రీద్, ఒకే సంవత్సరంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాల్లో సెలెక్ట్ అయి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతను టి ఏస్ పి ఏస్ సి, ఆర్ ఆర్ బి, ఎన్ టి పి సి, ఏస్ ఏస్ సి సి జి ఎల్ ,జూనియర్ లెక్చరర్ పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, ఏకకాలంలో ఏదు ఉద్యోగ అవకాశాలను సాధించాడు.



కుటుంబ నేపథ్యం:-

మొహమ్మద్ రజాక్, ఫాతిమా దంపతులకు ఇద్దరు కుమారులు , మొదటి కుమారుడు మొహమ్మద్ పాషా జూనేద్ ఏం టెక్ , ఎల్ ఎల్ బి పూర్తి చేసి వ్యాపారం చేస్తున్నాడు, రెండో కుమారుడు అయిన మొహమ్మద్ హఫ్రీద్ బి ఈ - మెకానికల్ ఇంజనీరింగ్ లో పట్టబద్ధుడై,ఏం. ఎ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశాడు. చదువుపై ఎనలేని ఆసక్తి ఉన్న అతను బీటెక్ పూర్తయ్యేలోపే పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాడు.

ఆర్ ఆర్ బి - ఎన్ టి పి సి 2020 నోటిఫికేషన్ లో సెంట్రల్ గవర్నమెంట్ ట్రెయిన్ మేనేజర్ గా ఉద్యోగం సాధించి, తన ప్రిపరేషన్ కి అడ్డంకి అవుతుందని రిజైన్ చేసి పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాడు.

ఆ క్రమం లో ఏస్ ఏస్ సి సి జి ఎల్ నోటిఫికేషన్ లో పోస్టల్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగం సాధించాడు. ఆ తరువాత ఏస్ సి సి ఎల్ జూనియర్ అసిస్టెంట్ పరీక్షలో 171వ ర్యాంక్ సాధించాడు.

టి ఏస్ పి ఏస్ సి గ్రూప్ 4 లో జిల్లా ఫస్ట్ వచ్చిన అతను ప్రస్తుతం రెవెన్యూ డిపార్ట్మెంట్ లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నారు.

తాజా గా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ -1 లో 448 మార్క్స్ సాధించాడు, గ్రూప్ -2 లో 377 మార్క్స్ తో స్టేట్ 313 ర్యాంక్ సాధించాడు, గ్రూప్ -3 లో స్టేట్ 22%అం% ర్యాంక్ సాధించాడు.

జూనియర్ లెక్చరర్ లో స్టేట్ 21వ ర్యాంక్ సాధించాడు.

"ఈరోజు నా కృషికి ఫలితం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపిక కావడం నాకు గర్వకారణం మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. నా విజయానికి నా తల్లిదండ్రుల సహాయం అమూల్యమైనది. వాళ్లు నాకు పూర్తిగా మద్దతు అందించారు, ఎప్పుడూ నన్ను ప్రోత్సహిస్తూ ఉండేవారు. ముఖ్యంగా కఠిన సమయాల్లో వాళ్ల మద్దతు నాకు బలాన్నిచ్చింది" అని మొహమ్మద్ హఫ్రీద్ తెలిపాడు.

నా విజయానికి తోడ్పడిన నా కుటుంబ సభ్యులు, గురువులు, స్నేహితులు, మరియు మెంటార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ప్రజల సంక్షేమానికి కృషి చేస్తూ, న్యాయసూత్రాలను అనుసరిస్తూ, నా బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తాను"

అని మొహమ్మద్ హఫ్రీద్ తెలియజేశారు.ఆరంభంలో కొన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ, తన నిరంతర కృషి, క్రమశిక్షణ, మరియు సమయపాలన వల్ల విజయాన్ని సాధించగలిగానని అంటున్నాడు. సరైన ప్రణాళిక వేసుకొని చదివితే, నిరంతరం ప్రయత్నిస్తే ప్రభుత్వ ఉద్యోగం సాధించటం సాధ్యమే" అని మొహమ్మద్ హఫ్రీద్ అభ్యర్థులకు సలహా ఇచ్చాడు.

కుటుంబ సభ్యుల ఆనందం-

వారి కుమారుడు ఘన విజయాన్ని సాధించడంతో తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. "మా కుమారుడు చిన్నప్పటినుంచి కష్టపడే పిల్లాడు. చదువుపై ఆసక్తి ఎక్కువ. అతని కృషికి ఇవాళ ఫలితం వచ్చింది" అని తండ్రి మొహమ్మద్ రజాక్ ఆనందం వ్యక్తం చేశారు. తల్లి భావోద్వేగంతో మాట్లాడుతూ, "తన ప్రతి ప్రయత్నంలో మేము వెన్నుదన్నుగా నిలిచాం. ఇప్పుడు అతని కల నెరవేరింది. మాకు గర్వకారణంగా మారాడు" అని అన్నారు.ఈ ఘనత సాధించిన విద్యార్థికి శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాం.

## రాబోయే తరాలకు సరైన వాతావరణాన్ని కల్పించడం మన బాధ్యత

**ఉమ్మడి భూపాలపల్లి జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షులు చల్లగురుగుల మల్లయ్య**

**వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో అవగాహన చైతన్య కార్యక్రమం**

ములుగు జిల్లా ప్రతినిధి, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మార్చి 15 ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ,జిల్లా వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో అవగాహన చైతన్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి భూపాలపల్లి జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షులు చల్లగురుగుల మల్లయ్య పాల్గొన్నారు. "ప్రపంచ వినియోగదారుల దినోత్సవం ప్రతి ఏటా మార్చి 15 వ తేదీన జరుపుకుంటామని, ఈ సంవత్సరం "స్థిరమైన జీవన శైలికి ఒక సరైన పరివర్తన" అను అంశాన్ని ఎంపిక చేసి అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని,ప్రకృతిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ,ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ,రాబోయే తరాలకు సరైన వాతావరణాన్ని కల్పించడం మన బాధ్యత అని,మన అవసరం మేరకు వస్తువులను,పరికరాలను కొనుగోలు చేసే క్రమంలో అసలు,నకిలీలను గుర్తించి బిల్లులు తీసుకొని భద్రపరచుకోవాలని,ఆరోగ్యాన్ని ఇచ్చే ఆహార పదార్థాలను,పండ్లు,కూరగాయలు తదితర సరుకులను సరైనవి చూసి కొనుగోలు చేసుకోవాలని, అనారోగ్యాన్ని కలిగించే కల్తీ,నకిలీ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని,రైతులు విత్తనాలు,ఎరువులు,పురుగు మందులను కొనే క్రమంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకొని భద్రపరచి ఉంచుకోవాలని,ఒకవేళ నాణ్యత లేని, లోపభూయిష్టమైనవిగా తేలితే వినియోగదారుల కోర్టుకు ఫిర్యాదు చేసి నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందని అన్నారు". ప్రస్తుత కాలంలో మన ఆహారపు అలవాట్లే ఆరోగ్యాన్ని నిర్దేశిస్తున్నాయని,హానికరం కాని ఆహార పదార్థాల్ని ఎంపిక చేసుకొని వినియోగించాలని,అందుకనుగుణంగా స్థిరమైన జీవన శైలికి ఒక పరివర్తన అవసరమని అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా పౌరసరఫాలశాఖ ఇన్చార్జి అధికారి మేనేజర్ బి. శ్రీరామ్ పతి,డిప్యూటీ తహసీల్దార్లు నితీష్, రామ్ చందర్, డాట ఎంట్రీ ఆపరేటర్ రాకేష్, ములుగు,భూపాలపల్లి వినియోగదారుల మండలి కోశాధికారి సంగ రంజిత్,సభ్యులు చుంచు రమేష్, చల్లగురుగుల రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్యాతం రాజేందర్ ,ఉపాధ్యాయులు శిరుప సతీష్,పిట్టల మల్లయ్య,హమీద్ , మదన్ మోహన్ , మల్లయ్య, చంద్రమౌళి, జాఫర్ అలీ, సత్యం, రజిత,తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాల విద్య జీవితంలో మర్చిపోలేనిదని: ప్రధానోపాధ్యాయులు ఈరులాల్

**10వ తరగతి విద్యార్థులకు వీడుకోలు**



ములుగు జిల్లా ప్రతినిధి, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :10వ, తరగతి విద్యార్థులకు వీడుకోలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల రాయినిగూడెంలో ప్రధానోపాధ్యాయులు ఈరులాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాలతో విద్యార్థులతో అనుబంధం అలాగే అనుభవాలను పంచుకొని మంచి మార్కులతో పాస్ అవుతామని తెలిపారు తదుపరి ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని 10/10గ్రేడ్ పాయింట్స్ తెచ్చుకోవాలని సూచించారు , ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల విద్య జీవితంలో మర్చిపోలేనిదని బాల్యన్ని గుర్తు చేసుకున్నారు మీరు పాఠశాలలో నేర్చుకున్న నైతిక విలువలు మీ గమ్యానికి పునాదులని 100%రిసల్ట్ ద్వారా పాఠశాలకు ఉపాధ్యాయులకు మీ తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు అనంతరం పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్ టికెట్, స్కేల్, పెన్నులు,చేతి గడియారాలు,కంపాక్స్, వస్తువులు కానుకగా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎర్రగట్టు జాతరలో మెడికల్ క్యాంపు నిర్వహణ మెడికల్ ఆఫీసర్ రాంబాబు




హసన్ పర్తి, మార్చి 15 (క్రాంతిన్యూస్ ) : హసన్ పర్తి మండలం భీమారంలో జరుగుతున్న ఎర్రగట్టు జాతరలో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ రోజు 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం యూపీఎస్సీ హసన్ పర్తి మెడికల్ ఆఫీసర్ రాంబాబు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని మరియు క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలి అని భక్తులను కోరారు. ఇందులో ఏ ఎన్ యం లు ప్రశాంతి,ఈశ్వరమ్మ,స్వరూప, హెల్త్ అసిస్టెంట్స్ సంతోష్ కుమార్, ఇంద్రారెడ్డి లు పాల్గొన్నారు.

## ముచ్చర్ల లో కాంగ్రెస్ కార్యకర్త మృతి



**- పరామర్శించిన నాయకులు**

హసన్ పర్తి, మార్చి 15 (క్రాంతిన్యూస్ ) :గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పరిధిలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సంద్ర సారయ్య అనారోగ్యంతో మరణించగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే అన్న గారైన కాంగ్రెస్ నాయకులు కేఆర్ కృష్ణమూర్తి నేడు వారి నివాసానికి వెళ్ళి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో కేఆర్ ప్రసన్న కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్, కరుణాకర్, భరత్, జగన్, మొగిలి, రాజు శ్రవణ్, సంపత్, కన్నయ్య, జితేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు....

## అంతర్గాం టిటిఎస్ లో అనుమానాస్పద స్థితిలో మరణించిన ఆలకుంట సంపత్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బొడ్డుపెల్లి శ్రీనివాస్



రామగుండం , 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : అంతర్గం మండలం అంతర్గాం టి టిఎస్ లో గల ఆలకుంట సంపత్ అనే వ్యక్తి నిజామాబాదులో గల్ఫ్ దేశాల ఏజెంట్గా పని చేస్తున్నారు కొన్ని కారణాలవల్ల అనుమానస్థితిలో మృతి చెందిన ఆలకుంట సంపత్ ను వారి యొక్క స్వగ్రామమైన అంతర్గ మండలంలోని అంతర్గం టిటిఎస్లో గల వారి యొక్క నివాసానికి వెళ్లి వారి పార్థివ దేహానికి పూలమాల వేసి వారి యొక్క కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారికి నేను అండగా ఉంటానని చావుకు కారణమైన వాళ్లందరిపై తప్పకుండా చర్య తీసుకోవాల్సిందిగా అలాగే ఆలకుంట సంపత్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించవలసిందిగా మాట్లాడిన బిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుల, రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ మరియు వారితోపాటు స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండల ఇన్చార్జి కోల సంతోష్, మాజీ సర్పంచ్ నుకరాజు, మాజీ ఉపసర్పంచ్ శశి కుమార్ ,మాజీ ఎంపిటిసి కొలిపాక మధుకర్ రెడ్డి, రామగుండం పట్టణ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు,ఇండిబేల్లి రవి, కొల్లూరి సమరం, జితేందర్ మరియు కుల సంఘం నాయకులు ఆలకుంట అంజయ్య, దండగుల సమ్మయ్య , ఆలకుంట రమేష్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు..

## అల్లి శ్రీనివాస్ రెడ్డి గారి సంస్మరణ సభను జయప్రదం చేయండి - సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య



మహబూబాబాద్ టౌన్ , 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :15 మార్చ్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ అల్లి శ్రీనివాస్ రెడ్డి గారి సంస్మరణ సభ రేపు ఉదయం 10 గంటలకు ఆర్తి గార్డెన్స్ మహబూబాబాద్ నిర్వహించడం జరుగుతుందని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య పిలుపునిచ్చారు శనివారం రోజు సిపిఎం పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన పార్టీ పట్టణ కమిటీ సమావేశం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా సోమయ్య గారు హాజరై మాట్లాడుతూ ఈ సభకు ప్రధాన వార్తగా సిపిఎం పార్టీ కేంద్రకం సభ్యులు జి నాగయ్య గారు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య గారు సీనియర్ నాయకులు జి రాములు గారు రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి గారు జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ గారు హాజరవుతున్నారని అన్నారు అమరజీవి కామ్రేడ్ అల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నత కుటుంబంలో పుట్టిన ఉన్నత ఆలోచనలతో సిపిఎం పార్టీ ఎర్రజెండా చేతపట్టి పేద బడుగు బలహీన వర్గాల కోసం తన వంతు కృషి చేశారు. అలాగే మానుకోట పట్టణంలో పట్టణ కార్యదర్శిగా పనిచేసి అంచలంచలుగా పార్టీలో మానుకోట టూ టౌన్ సెక్రటరీగా జిల్లా కమిటీ సభ్యుడి వరకు ఎదిగి పట్టణంలో పలుభూ పోరాటాలలో పాల్గొని పేదలకు ఇంటి స్థలాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు అలాగే ఒక క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు నాయకుడిగా ఆదర్శవంతంగా అందరికీ అందుబాటులో ఉన్న నాయకుడిగా ఉన్నారు. అని అన్నారు కావున రేపు జరగబోయే సభలో పార్టీ శ్రేణులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి రావుల రాజు చీపిరిగా యాకన్న హేమా నాయక్ నక్క సైదులు బానోత్ వెంకన్న ఎండి రజాక్ తదితరులు పాల్గొన్నారు

# వేసవి కాలం దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్.జి .మురళీధర్**

మహబూబాబాద్, టౌన్ , 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :రాష్ట్రంలో మరియు జిల్లాలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్నందున వేసవి కాలంలో తీవ్రమైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు "వడదెబ్బకు" గురయ్యే అవకాశం కలదని ప్రజలందరూ తగిన జాగ్రతలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్.జి .మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వేసవికాలంలో వడ దెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్ళే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కనిపిస్తాయని పేర్కొన్నారు.

వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ గల ప్రదేశానికి చేర్చాలి, శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి, ఎండ దెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, పప్పుకట్టు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగించాలి, సత్వర చర్యల కొరకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స చేసిన తరువాత దగ్గరలో గల ఆరోగ్య కేంద్రం/ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని తెలిపారు.

వడ దెబ్బ తగలకుండా ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం/ఆడటం చేయరాదు, తప్పనిసరి పరిస్థితులలో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలి, తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి, నీరు మరియు ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి, మత్తు పానీయాలు తీసుకోరాదు, ముఖ్యంగా ఇంటివద్ద వుండే పిల్లలు, 60 సం.ల. పై బడిన వారు, అనారోగ్యంతో బాధపడేవారు తరచుగా మంచినీరును మరియు ఓఆర్ఎస్ ను త్రాగలని, ఒకవేళ



నోరు ఎండుకపోవడం, దాహం వేయడం లక్షణాలు వుంటే దగ్గరలోని ఆశా కార్య కర్తను సంప్రదించాలని తెలిపారు. అలాగే బయట పనికి వెళ్ళేవారు ఉదయం 12 గంటలలోపు మరియు సాయంత్రం 4 గంటల తదుపరి పనిచేసుకొవాలని మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాలన్నారు.

ప్రతి ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రం, ఆశా కార్య కర్త వద్ద, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, గ్రామ పంచాయత్ లలో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో కలవు కావున అవసరం ఉన్నవారు ఉపయోగించుకోగలరని పైన తెలిపిన జాగ్రత్తలు పాటిస్తూ వడ దెబ్బకు గురి కాకుండా చూసుకోవాలని తెలిపారు. అంతే కాకుండా వేసవి కాలంలో వచ్చే వ్యాధుల పై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

# హెూలీ సంబరాల్లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పాల్గొన్నా సిపి



రామగుండం, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో హెూలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. హెూలీ పండుగను పురస్కరించుకొని, రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ అధికారులు,సిబ్బంది కలిసి ముందుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పైన రంగులు .చల్లారు ఈ సందర్భంగా సీపీ అధికారులు,సిబ్బందికి రంగులు పూసి హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ వేళ అధికారులు సిబ్బంది పరస్పరం రంగులు పూసుకోవడంతో పాటు,బ్యాండ్ వాయిద్యాలతో పోలీస్ కమిషనర్, అధికారులు,సిబ్బంది, అందరు ఆనందం తో నృత్యాలు చేశారు. అనంతరం,ఈ సంబరాల్లో పాల్గొన్న చిన్న పిల్లలకు పోలీస్ కమిషనర్ మిఠాయిలను అందజేసారు.

ఈ హెూలీ వేడుకలను పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి కుటుంబంలో సంతోషాలు, వెల్లు విరియాలని, ఈహెూలీ పండుగ మీ జీవితాలను రంగులమయం చేయాలని అన్నారు

ఈ వేడుకల్లో.. మంచిర్యాల డిసిప్ ఎ,బాస్కర్ ఐపిఎస్., అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, గోద్వారిఖని ఎసిపి ఎం.రమేష్ , ట్రాఫిక్ ఎసిపి నర్సింహులు, టాస్క్ ఫోర్సు ఎసిపి మల్ల రెడ్డి , ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, సిసి హరీష్ , ఎస్.ఐ, ఆర్ ఎస్ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో ఇంక్రిమెంట్ కొరకు ఆడిట్ సిబ్బందితో తనిఖీ



భద్రాద్రి కొత్తగూడెం , 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : కొత్తగూడెం ఏరియాలోని ఎస్ సి డబ్ల్యు ఎ ఉద్యోగులకు మార్చి నెలలో అర్హతను అనుసరించి అన్యువల్ ఇంక్రిమెంట్ యొక్క బేసిక్ అప్డేషన్ కొరకు కార్పొరేట్ లోని ఆడిట్ డిపార్ట్మెంట్ వారిచే తనిఖీ చేయించడం జరిగింది. గతంలో ఈ అన్యువల్ ఇంక్రిమెంట్ ఆడిటింగ్ కార్పొరేట్ లోని కొత్తగూడెం రీజియన్ ఆఫీస్ కు వెళ్ళి ఆడిటింగ్ జరిగేది ఇప్పుడు ఈ ప్రక్రియను కొత్తగూడెం ఏరియా ఆడిట్ డిపార్ట్మెంట్ వారు వచ్చి ఉద్యోగుల యొక్క అన్యువల్ ఇంక్రిమెంట్ మార్చి నెలసరి జీతంతో రావడం కొరకు మరియు ఎటువంటి జాప్యం జరగకుండా ఉండుట కొరకు ఇంటర్నల్ ఆడిట్ డిపార్ట్మెంట్ కొత్తగూడెం రీజియన్ వారే వారి యొక్క బృందంతో ఈ ఆడిటింగ్ ను కొత్తగూడెం ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ నందు కొత్తగూడెం ఏరియాలోని మైన్స్ మరియు డిపార్ట్మెంట్ లలో పనిచేయు సంబంధిత క్లారికల్ సిబ్బందిని కాన్ఫరెన్స్ హాల్ లో సమావేశపరిచి వారి యొక్క మైన్స్ మరియు డిపార్ట్మెంట్ ఉద్యోగుల అన్యువల్ ఇంక్రిమెంట్ ను ఆడిటింగ్ చేయించడం జరిగింది. అలాగే ఆడిటింగ్ లో వ్యక్తపరిచిన సందేహాలను పరిష్కరిస్తూ తగిన సమయంలో సుమారు 1875 మంది ఉద్యోగుల యొక్క బేసిక్ అప్డేషన్ ప్రపోజల్స్ ను ఆడిటింగ్ చేస్తున్నారు ఇందులో 1570 మంది ఉద్యోగులు డైలీ రేటెడ్ వారు ఉండగా 305 మంది మంత్లీ రేటెడ్ ఉద్యోగులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి తేదీ 15.03.2025న కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆదేశానుసారం డిజిఎం (పర్సనల్) బి.శివకేశవరావు పర్యవేక్షణలో ఈ ఆడిట్ కమిటీ తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ సంధ్భంగా డిజిఎం (పర్సనల్) మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియా ఉద్యోగులకు అన్యువల్ ఇంక్రిమెంట్ ఆలస్యం కాకుండా త్వరితగతిన చేయడానికి ఏరియాకు వచ్చిన కొత్తగూడెం రీజియన్ ఇంటర్నల్ ఆడిట్ బృందం వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిజిఎం (పర్సనల్) తో పాటు సీనియర్ పిఓ ఎం.మురళి, ఇంటర్నెట్ అడిట్ డిపార్ట్మెంట్ అధికారి దినేష్ మరియు వారి ఆడిటింగ్ బృందం అలాగే కొత్తగూడెం ఏరియాలోని మైన్స్ మరియు డిపార్ట్ మెంట్ లలో పనిచేయు సంబంధిత క్లారికల్ సిబ్బందిని పాల్గొనడం జరిగింది.

# వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు**



ములుగు,, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లోని సమావేశం మందిరంలో శనివారం , మాతా శిశు సంరక్షణ బృంద సిబ్బంది , ఆర్బిఎస్కే ప్రోగ్రాం సిబ్బంది సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ,స్కూల్ పిల్లలకు వడదెబ్బ నుండి రక్షణ పొందుటకు ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని, వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్, ఆరోగ్య కార్యకర్త , ఆశా కార్యకర్తల సమన్వయంతో శిశు సంరక్షణ సిబ్బంది, నిర్దిష్టమైన ప్రణాళికలను తయారు చేసుకుని ప్రణాళికల యుతంగా, గర్భిణీ స్త్రీలకు , బాలింతలకు నిరంతర పరీక్షలు నిర్వహించాలని, గర్భిణీ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుపాలని, గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను గుర్తించి వారికి పోషకాహార పట్ల అవగాహన కల్పించాలని, సాధారణ కాన్పు ఉపయోగాలు , సిజేరియన్ కాన్పు వల్ల జరిగే నష్టాలను గర్భిణీ స్త్రీలకు వివరించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో నే ప్రసూతులను చేయించుకోవాలనే విషయాలపై గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలని, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని, సమయానుకులంగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని బాలింతలకు తెలియజేయాలని, డి ఎం ఎన్ హెచ్ ఓ గోపాల్ రావు తెలిపారు. అలాగే ఆర్బిఎస్కే కార్యక్రమంలోని భాగంగా జిల్లాలోని అన్ని హాస్టలను, పాఠశాలలను మరియు అంగన్వాడి సెంటర్లలోని స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించాలని, పాఠశాల , హాస్టల్ విద్యార్థులకు వడదెబ్బ వల్ల కలిగే నష్టాలను తెలియజెప్పి తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల స్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని, వారికి ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలియజెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. విపిన్ కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్. శ్రీకాంత్, డాక్టర్. పవన్ కుమార్, డాక్టర్ .రణధీర్ , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు ఆర్బిఎస్కే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ నరహరి, ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం డాక్టర్స్ సిబ్బంది ,మాతా శిశు సంరక్షణ వైద్యులు, సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

# ఇదేం చేస్తుందిలే అనుకునేరు..

## సిక్రెట్ తెలిస్తే జింగ్ జింగ్ అమేంజింగ్ అంతే..

హెల్త్ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :మన వంటగదిలో సాధారణంగా ఉపయోగించే మసాలా దినుసుల్లో లవంగం ఒకటి.. లవంగాలు మంచి సువానతోపాటు ఘాటుగా ఉంటాయి.. ఇవి ఆహార రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి.. లవంగాలను శతాబ్దాలుగా భారతీయ, ఆసియా వంటకాల్లో ఉపయోగిస్తున్నారు.. వాటి రుచి, వాసన, ఔషధ గుణాలకు ప్రసిద్ధి చెందాయి. అయితే.. లవంగాలు శరీరానికి అనేక రకాలుగా మేలు చేస్తాయి.. అనేక రకాల శరీర సమస్యలను నయం చేయడానికి ఆయుర్వేదంలో లవంగాల ప్రస్తావన ఉంది.. దీనిని శక్తివంతమైన ఔషధంగా పేర్కొంటారు ఆయుర్వేద నిపుణులు.. లవంగాల చిన్న మొగ్గలను సుగంధ ద్రవ్యంగా మాత్రమే కాకుండా ఆయుర్వేద వైద్యంలో కూడా ఉపయోగిస్తారు. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, నొప్పి నివారిణిగా పనిచేస్తుంది.

లవంగాలు వేడి స్వభావాన్ని కలిగి ఉంటాయి.. ముఖ్యంగా శీతాకాలంలో దీనిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. లవంగాలలో విటమిన్ కె, ఫోలేట్, మాంగనీస్, పొటాషియం, బీటా కెరోటిన్ వంటి ఇతర ముఖ్యమైన ఖనిజాలు వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఈ మూలకాల కలయిక వివిధ శరీర భాగాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది.. ఇంకా అనేక వ్యాధులను నివారించేందుకు ఉపయోగపడుతుంది.



జీవక్రియ: లవంగాలు తినడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. లవంగాలలో లభించే యూజినాల్ వంటి అంశాలు శరీర కొవ్వును కాల్చడంలో సహాయపడతాయి.. ఇది బరువు తగ్గడానికి సహజ నివారణగా పనిచేస్తుంది. లవంగాలలో లభించే యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. అంతేకాకుండా, లవంగాల వినియోగం శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది, ఇది వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది మరియు గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

లవంగం నూనె: వైద్యశాస్త్రంలో కూడా లవంగం నూనెకు ముఖ్యమైన స్థానం ఉంది. ఆయుర్వేదంలో, లవంగం నూనెను అనేక వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. దీని యాంటీ బాక్టీరియల్ - యాంటీ ఫంగల్ లక్షణాల కారణంగా, దీనిని పంటి నొప్పి, చిగుళ్ల వాపు, ఇన్ఫెక్షన్ల చికిత్సలో ఉపయోగిస్తారు. లవంగం నూనె ఒక సహజ మత్తుమందు (తిమ్మిరి కలిగించే ఏజెంట్) లాంటిది.. ఇది పంటి నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, ఇది కడుపు పూతలను నయం చేయడంలో కూడా సహాయపడుతుంది. లవంగం నూనె తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.. కడుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.

రక్తంలో చక్కెర: లవంగాల వల్ల కలిగే మరో ప్రయోజనం ఏమిటంటే.. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఎలుకలపై నిర్వహించిన ప్రయోగాలలో, లవంగం సారం ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుందని, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరిశోధన లవంగాల వినియోగం మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుందని రుజువు చేస్తుంది.

క్యాన్సర్: క్యాన్సర్‌కు వ్యతిరేకంగా లవంగాల ప్రయోజనాలపై కూడా పరిశోధనలు జరిగాయి. లవంగాలలో లభించే మూలకాలు కణాలకు జరిగే నష్టాన్ని తగ్గిస్తాయని, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని అనేక పరిశోధనలు చూపిస్తున్నాయి. లవంగం సారం అనేక రకాల క్యాన్సర్ కణాల పెరుగుదలను నెమ్మదిస్తుంది.. క్యాన్సర్ చికిత్సలో కూడా సహాయపడుతుంది. పెద్దప్రేగు, రొమ్ము, ఇతర రకాల క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా లవంగం సారం ప్రభావవంతంగా ఉంటుందని నిరూపించబడింది.

కాలేయ ఆరోగ్యం: దీనితో పాటు, లవంగాల వినియోగం కాలేయ పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. లవంగాలలో లభించే యూజినాల్ కాలేయానికి మేలు చేస్తుంది.. కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. దీని వినియోగం కాలేయ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.. కొవ్వు కాలేయం - సిర్రోసిస్ లక్షణాలను తగ్గిస్తుంది.

లవంగాల ప్రయోజనాలు

లవంగాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉన్నాయి.. కానీ దాని అధిక వినియోగం కూడా కొన్ని హానికరమైన ప్రభావాలను కలిగిస్తుంది. లవంగం నూనెలో అధిక మొత్తంలో యూజినాల్ ఉంటుంది.. దీనిని పెద్ద పరిమాణంలో తీసుకుంటే శరీరంపై విషపూరిత ప్రభావాలను చూపుతుంది. ముఖ్యంగా పిల్లలకు లవంగం నూనె మరింత హానికరం. దీనితో పాటు, లవంగం రక్తాన్ని పలుచబరిచే మందులతో కలిపినప్పుడు ప్రమాదకరమైన ప్రభావాలను కలిగిస్తుంది. కాబట్టి లవంగం తినేటప్పుడు అది ఏ ఔషధ వినియోగాన్ని ప్రభావితం చేయకుండా చూసుకోవడం ముఖ్యం..

వైద్యుడు లేదా ఆయుర్వేద నిపుణులను సంప్రదించడం మంచిది..

లవంగాలు తినడం వల్ల సహజమైన - సురక్షితమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మీరు ఏదైనా వైద్య ప్రయోజనం కోసం లవంగం లేదా దాని నూనెను తీసుకోవాలంటే.. వైద్యుడిని లేదా ఆయుర్వేద నిపుణుడిని సంప్రదించడం మంచిది.

# ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా

## ఉండాలంటే వీటిని తినాల్సిందే..!

హెల్త్ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : మన శరీరంలోని ఎముకలు ఆరోగ్యంగా ఉండాంటే మనం క్యాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. క్యాల్షియం వల్ల ఎముకలు బలంగా, ఆరోగ్యంగా మారుతాయి. అలాగే విటమిన్ డి కూడా ఎముకల ఆరోగ్యానికి దోహద పడుతుంది. మన శరీరం క్యాల్షియంను అధికంగా శోషించుకుని ఎముకలు బలంగా ఉండాలంటే అందుకు విటమిన్ డి కావాలి. క్యాల్షియం శోషణకు విటమిన్ డి పనిచేస్తుంది. ఎముకల సాంద్రత పెరిగేందుకు విటమిన్ కె కూడా అవసరమే. ఇలా ఈ మూడు పోషకాలు ఉన్న ఆహారాలను మనం తరచూ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే మెగ్నిషియం, ఫాస్ఫరస్ వంటి ఇతర మినరల్స్ వల్ల కూడా ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. కనుక వీటిన్నింటినీ మనకు లభించేలా చూసుకోవాలి.



అంజీర్ పండ్లు..

క్యాల్షియం అధికంగా ఉండే ఆహారాల్లో అంజీర్ పండ్లు కూడా ఒకటి. ఇవి మనకు డ్రై ఫ్రూట్స్ లాగా ఎక్కువ శాతం అందుబాటులో ఉంటాయి. రోజూ రాత్రి పూట 3 లేదా 4 అంజీర్ పండ్లను నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం ఈ పండ్లను తినాలి. అంజీర్ పండ్లను ఒక కప్పు తింటే మనకు సుమారుగా 121 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. ఈ పండ్లలో ఫైబర్, పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి కండరాల పనితీరును మెరుగు పరుస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. నారింజ పండ్లను తింటున్నా కూడా క్యాల్షియం లభిస్తుంది. ఒక మీడియం సైజ్ నారింజ పండును తింటే సుమారుగా 74 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. నారింజ పండ్లలో విటమిన్ సి కూడా అధికంగానే ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. అలాగే క్యాలరీలు కూడా తక్కువే కనుక ఈ పండ్లను తింటే బరువు కూడా తగ్గుతారు.

సముద్రపు చేపలు..

సముద్రపు చేపలను ఆహారంగా తీసుకుంటే క్యాల్షియం అధిక మొత్తంలో లభిస్తుంది. 120 గ్రాముల చేపలను తింటే సుమారుగా 351 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. అలాగే చేపలను తినడం వల్ల నాడీ మండల వ్యవస్థకు అవసరం అయిన విటమిన్ బి12ను కూడా పొందవచ్చు. చేపలను తింటే ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పనితీరు మెరుగు పడుతుంది. క్యాల్షియం అధికంగా ఉండే ఆహారాల్లో బెండకాయలు కూడా ఒకటి. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. బెండకాయలను ఒక కప్పు తినడం ద్వారా సుమారుగా 82 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. బెండకాయల్లో ఉండే విటమిన్ బి6, ఫోలేట్ ఆరోగ్యాన్ని అందిస్తాయి. రోగాలు రాకుండా చూస్తాయి.


బాదంపప్పు..


సోయా టోఫులోనూ క్యాల్షియం అధికంగానే ఉంటుంది. దీన్ని సగం కప్పు తింటే సుమారుగా 434 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. అలాగే బాదంపప్పును కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. బాదంపప్పును 30 గ్రాముల మేర తింటే 75 మిల్లీగ్రాముల క్యాల్షియం లభిస్తుంది. బాదంపప్పును పొట్టు తీయకుండా తింటేనే మేలు జరుగుతుంది. బాదంపప్పులో విటమిన్ ఇ, పొటాషియం కూడా అధికంగానే ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను తింటే కేవలం ఎముకలు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

# వేసవి వాతావరణంలో తాగవల్సిన

## పానీయాలు, ఏంటవి?

హెల్త్ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : మనం తీవ్రమైన వేసవి వేడిని ఎదుర్కొంటున్నాము. పరిసర ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నిర్జలీకరణాన్ని నివారించడానికి తాగునీరు ఉత్తమ మార్గం.క్రమం తప్పకుండా మంచినీరు త్రాగడం ద్వారా మీ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోండి.నీళ్లు తాగకుండా జ్యూస్‌లు, సాఫ్ట్ డ్రింక్స్ మాత్రమే తాగడం మంచిది కాదు.నీటి తర్వాత, కొబ్బరి నీళ్లు శరీరానికి ఉత్తమమైనవి. తర్బూజా రసం లేదంటే ఉప్పు కలిపిన నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు.ఉప్పు కలిపిన గంజి నీరు కూడా నిర్జలీకరణాన్ని నివారిస్తుంది.మీ శరీరం వేడికి అలసిపోయినట్లు అనిపిస్తే, మీరు ORS ద్రావణాన్ని త్రాగవచ్చు.పుచ్చకాయ రసం, చెరుకు రసం కూడా శరీరాన్ని చల్లబరుస్తాయి.





క్రాంతి KR TV

ఆదివారం 16 మార్చి 2025

# క్రీడలు

epaper.krtvnews.com



## టీ20, వన్డేలు చాలు.. టెస్టుల్లో ఆడలేను..

## కారణం ఇదే: వరుణ్ చక్రవర్తి

స్పోర్ట్స్ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : టెస్టు ఫార్మాట్ తనకు సరిపడదని టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అన్నాడు. టీ20, వన్డేల్లో కొనసాగితే చాలని.. అందులోనే తనకు సంతృప్తి దొరుకుతుందని పేర్కొన్నాడు. కాగా 2021లో టీమిండియా తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఈ కర్ణాటక బౌలర్ చాలాకాలం పాటు జట్టుకు దూరంగానే ఉన్నాడు.



రీ ఎంట్రీలో అదుర్స్

అయితే, ఐపీఎల్‌లో సత్తా చాటుతున్న వరుణ్ చక్రవర్తి జాతీయ జట్టులో పునరాగమనం చేయడానికి ప్రధాన కారణం హెడ్‌కోచ్ గౌతం గంభీర్. గతేడాది కోల్‌కతా నైట్ రైడర్స్ మెంటార్‌గా పనిచేసిన గౌతీ.. ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వరుణ్ నైపుణ్యాలను దగ్గరగా గమనించాడు. ఈ క్రమంలో వరుణ్ టీమిండియా రీఎంట్రీకి మార్గం సుగమమైందని చెప్పవచ్చు.

గతేడాది స్వదేశంలో బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ సందర్భంగా అదరగొట్టిన వరుణ్.. ఆ తర్వాత సౌతాఫ్రికా పర్యటనలోనూ సత్తా చాటాడు. అనంతరం సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన ఈ రైటార్మ్ లెగ్ బ్రేక్ స్పిన్నర్.. వన్డే జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు.

చాంపియన్స్ ట్రోఫీలోనూ సత్తా చాటి

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సందర్భంగా అరంగేట్రం చేసిన వరుణ్.. అనూహ్య రీతిలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 జట్టుకు ఎంపికయ్యాడు. తొలి రెండు మ్యాచ్‌లలో తుదిజట్టులో స్థానం దక్కనప్పటికీ.. లీగ్ దశలో ఆఖరిగా న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో ఆడిన 33 ఏళ్ల ఈ స్పిన్ బౌలర్.. ఏకంగా ఐదు వికెట్లు కూల్చాడు.

అంతేకాదు.. ఆస్ట్రేలియాతో సెమీస్‌లో టీమిండియా విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అదే విధంగా.. ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించడంలోనూ తన వంతు సాయం చేశాడు. కేవలం మూడు మ్యాచ్‌లలోనే తొమ్మిది వికెట్లు తీసి చాంపియన్స్ ట్రోఫీ-2025 అత్యధిక వికెట్ల వీరుల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు.

టెస్టుల్లో ఆడటం నాకూ ఇష్టమే.. కానీ

ఈ నేపథ్యంలో వరుణ్ చక్రవర్తిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. టెస్టుల్లోనూ అతడిని ఆడించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో వరుణ్ స్వయంగా తనకు టెస్టు ఫార్మాట్ సరిపడదని చెప్పడం విశేషం. ఓ యూట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "టెస్టుల్లో ఆడటం నాకూ ఇష్టమే. కానీ నా బౌలింగ్ శైలి అందుకు సరిపడదు.

నా బౌలింగ్ స్టైల్ ఇంచుమించు మీడియం పేస్‌లాగే ఉంటుంది. ఇక టెస్టు క్రికెట్‌లో వరుస విరామాల్లో 20- 30 ఓవర్లు బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. నాకు అది సాధ్యం కాదు. నేను కాస్త ఫాస్ట్‌గా బౌల్ చేస్తాను కాబట్టి.. 10- 15 ఓవర్ల వరకే నాకు సౌకర్యంగా ఉంటుంది. అదేమో రెడ్ బాల్ క్రికెట్‌కు సరిపడదు.

అందుకే నేను ప్రస్తుతం 20, 50 ఓవర్ల క్రికెట్‌పై మాత్రమే దృష్టి పెట్టాను. వైట్‌బాల్ క్రికెట్‌కే పరిమితం కావాలని భావిస్తున్నాను" అని వరుణ్ చక్రవర్తి తన మనసులోని మాటను వెల్లడించాడు.

అక్కడన్నీ స్పిన్‌కు అనుకూలమైన వికెట్లు

ఇక ఆరంభంలో పేసర్‌గా ఉన్న తమిళనాడు బౌలర్ వరుణ్.. తర్వాత స్పిన్నర్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ విషయంలో పశ్చాత్తాపం ఉందా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. "నిజమే.. తొలిరోజుల్లో నేను మీడియం పేస్‌తో బౌలింగ్ చేశా. అక్కడ చాలా మంది పేసర్లు ఉండేవారు.

అయితే, తమిళనాడు వికెట్లపై బంతి స్వింగ్ కాదు. అక్కడన్నీ స్పిన్‌కు అనుకూలమైన వికెట్లు. అందుకే మీరు తమిళనాడు నుంచి ఎక్కువ మంది ఫాస్ట్ బౌలర్లను చూడలేరు" అని చెప్పుకొచ్చాడు. కాగా ఇంగ్లండ్‌తో జూన్‌లో మొదలయ్యే టెస్టు సిరీస్‌లో వరుణ్ చక్రవర్తిని ఆడించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న వేళ.. అతడు తనంతట తానుగా పోటీ నుంచి తప్పుకోవడం గమనార్హం.

## కరీ... '3' చీర్స్

స్పోర్ట్స్ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :అమెరికా బాస్కెట్‌బాల్ స్టార్ స్టీఫెన్ కరీ అరుదైన ఘనత తన పేరిట లిఖించుకున్నాడు. 'త్రీ' పాయింటర్లు స్కోరు చేయడంలో సిద్ధహస్తుడైన కరీ.. ప్రతిష్టాత్మక జాతీయ బాస్కెట్‌బాల్ సంఘం (ఎన్‌బీఏ)లో 4 వేల త్రీ పాయింటర్లు సాధించిన తొలి ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. లీగ్‌లో భాగంగా 'గోల్డెన్ స్టేట్ వారియర్స్' జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 37 ఏళ్ల కరీ... శుక్రవారం సాక్రమెంటో కింగ్స్ జట్టుతో జరిగిన పోరులో ఈ మైలురాయి దాటాడు.

ఆట మూడో క్వార్టర్ 8వ నిమిషంలో నాలుగో ప్రయత్నంలో కరీ... త్రీ పాయింటర్ సాధించాడం ద్వారా 4000 త్రీ పాయింటర్లు ఖాతాలో వేసుకున్నాడు. ఫలితంగా గోల్డెన్ స్టేట్ వారియర్స్ జట్టు 130%-%104 పాయింట్ల తేడాతో సాక్రమెంటో కింగ్స్‌పై విజయం సాధించింది. సుదీర్ఘ కాలంగా 'పాయింట్ గార్డ్' పొజిషన్‌లో ఆడుతున్న కర్రీ... తన జట్టుకు ఎన్నో మరపురాని విజయాలు అందించాడు. 2009 అక్టోబర్ 30న కరీ తన తొలి 'త్రీ' పాయింటర్ సాధించాడు.



ఎన్‌బీఏ చరిత్రలో అత్యధిక త్రీ పాయింటర్లు సాధించిన ఆటగాడిగా రే అలెన్ (2,973) పేరిట ఉన్న రికార్డును 2021లో అధిగమించిన కరీ... అదే జోరు కొనసాగిస్తూ పుట్టినరోజున మరో ఘనత తన పేరిట లిఖించుకున్నాడు. ఓవరాల్‌గా ఈ జాబితాలో ప్రస్తుతం కరీ తర్వాత జేమ్స్ హర్డెన్ (3,127), డామియన్ లిలార్డ్ (2,794) ఉన్నారు. బాస్కెట్‌కు 23.9 ఫీట్ల (7.24 మీటర్లు) దూరంలోని గీత నుంచి నేరుగా బంతిని లక్ష్యాన్ని చేర్చగలిగితే 3 పాయింట్లు లభిస్తాయి.

అంతర్జాతీయ పోటీల్లో 22.2 ఫీట్లు ఉన్న ఈ దూరం... ఎన్‌బీఏలో మాత్రం 23.9 ఫీట్లుగా ఉంది. ప్రత్యర్థి కళ్లు గప్పగల నైపుణ్యంతో పాటు... దూరం నుంచే లక్ష్యాన్ని గురిపెట్టగల సామర్థ్యం కలగలిసినప్పుడే త్రీ పాయింటర్లు సాధ్యమవుతాయి. ఈ విషయంలో కెరీర్ ఆరంభం నుంచి తన ప్రత్యేకత చాటుకుంటున్న కరీ... 'త్రీ' పాయింటర్ స్పెషలిస్ట్‌గా ఎదిగాడు. ఇప్పటి వరకు ఎన్‌బీఏలో రెండుసార్లు అత్యంత విలువైన ఆటగాడిగా నిలిచిన కరీ... ఈ క్రమంలో ఎన్‌బీఏ చరిత్రలో 25,000 పాయింట్లు సాధించిన 26వ ప్లేయర్‌గా నిలిచాడు.

'అతడు జట్టుకు ఎంతో ముఖ్యం. కీలక సమయాల్లో అతడు సాధించే పాయింట్లు టీమ్ భవితవ్యాన్ని నిర్ణయిస్తుంటాయి. ఆటను ఎలా మలుపుతిప్పాలో అతడికి బాగా తెలుసు. ఎలాంటి పరిస్థితుల్లోనూ తన ఏకాగ్రత కోల్పోడు. చిన్నప్పటి నుంచి అతడి నిశిత పరిశీలన నన్ను ఆకట్టుకుంటోంది' అని కోచ్ స్టీవ్ కెర్ అన్నాడు. 'నేనెప్పుడూ త్రీ పాయింటర్ల గురించి ఆలోచించలేదు. ఆటలో భాగంగా అవి వాటంతటవే వచ్చి చేరుతున్నాయి.

నా వరకు మ్యాచ్ విజయమే ముఖ్యం. ఈ క్రమంలో 4 వేల త్రీ పాయింటర్లు సాధించడం ఆనందంగా ఉంది. అయితే అది ఒక నంబర్ మాత్రమే' అని 2024 పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన అమెరికా జట్టులో సభ్యుడిగా ఉన్న కరీ అన్నాడు.

## వరుసగా 24వ ఏడాది టైటిల్ లేకుండానే..

స్పోర్ట్స్ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నుంచి వరుసగా 24వ ఏడాది భారత క్రీడాకారులు టైటిల్ లేకుండానే తిరిగి రానున్నారు. భారత్ నుంచి ఐదు విభాగాల్లో కలిపి మొత్తం 17 మంది క్రీడాకారులు ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగగా... ఒక్కరు కూడా క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయారు. సంచలన విజయాలతో ఆశలు రేకెత్తించిన లక్ష్య సేన్, పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది.




శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 10-21, 16-21తో ఆరో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ను ఓడించిన లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లో అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమయ్యాడు.

## నితీశ్ కుమార్ రెడ్డి ఫుల్ ఫిట్..

## సన్‌రైజర్స్‌తో కలవనున్న ఆల్‌రౌండర్

స్పోర్ట్స్ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఫిట్‌నెస్ పరీక్షలో క్లియర్ అయినట్లు తెలుస్తోంది. వెన్ను నొప్పితో బాధపడుతున్న నితీశ్.. ఫుల్ ఫిట్ అయినట్లు ఓ రిపోర్టు ద్వారా వెల్లడైంది. అయితే త్వరలోనే అతను హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టుతో కలవనున్నట్లు కూడా వార్తలు అందుతున్నాయి. క్రికెటర్ నితీశ్ ఇటీవల జరిగిన ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన విషయం తెలిసిందే. అయితే ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ సమయంలో అతను గాయానికి గురయ్యాడు. ఫిట్‌నెస్‌కు చెందిన అన్ని రొటీన్ పరీక్షలను నితీశ్ రెడ్డి క్లియర్ చేసినట్లు తెలుస్తోంది. యో-యో టెస్టులో కూడా అతను పాసైనట్లు రిపోర్టు ఉంది. బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నితీశ్ .. కోలుకుంటున్నాడు. ఫిజియో అతనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇంగ్లండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో ఆడినా.. దాంట్లో అతను బౌలింగ్ కానీ, బ్యాటింగ్ కానీ చేయలేదు.ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టు .. నితీశ్ రెడ్డిని 6 కోట్లకు ఖరీదు చేసింది. గత సీజన్‌లో అతను 13 మ్యాచుల్లో 303 రన్స్ చేశాడు. అతని స్ట్రయిక్ రేట్ 143గా ఉంది. ఆస్ట్రేలియా సిరీస్‌లో అతను తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో విరోచితంగా 114 రన్స్ చేశాడు.



సన్‌రైజర్స్ జట్టు తన తొలి మ్యాచ్‌ను మార్చి 23వ తేదీన రాజస్థాన్ రాయల్స్‌తో హైదరాబాద్‌లో ఆడనున్నది.

# సినిమా న్యూస్

epaper.krtvnews.com



## నయన కలలు నిజమవుతాయా?

మూవీ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :ఒక చిన్న ఇల్లు.. ప్రేమించే భర్త.. అమ్మా అంటూ ఆప్యాయంగా పిలిచే పిల్లలు.. ప్రతి స్త్రీ తన జీవితంలో కోరుకునేది ఇదే కదా! ఇలాంటి ఓ సాధారణ జీవితం తనకీ కావాలని ఆరాటపడుతుంది నయనతార . మరి ఆమె కలలు నిజమవుతాయా? లేక సుదూర కలలుగానే మిగిలిపోతాయా? అనేది తెలుసుకోవాలంటే 'టెస్ట్' చూడాల్సిందే. విలక్షణ నటుడు ఆర్.మాధవన్, నయనతార, సిద్ధార్థ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. శశికాంత్ దర్శకుడు. ఈ సినిమా వచ్చే నెల 4న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలో నయన.. కుముధ అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుపుతూ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో ఓ ఉపాధ్యాయురాలిగా.. మరోవైపు అమ్మా అనే పిలుపు కోసం ఆరాటపడుతున్న తల్లిగా కనిపిస్తుంది నయన. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "కుముధ బలం.. తన ఇల్లు, కుటుంబం, ప్రేమ. కానీ జీవితం ఆమెకు ఊహించని పరీక్ష పెడుతుంది. దాని కోసం ఆమె పోరాడే విధానం మిమ్మల్ని భావోద్వేగానికి గురిచేస్తుంది. నిజంగా ఇలాంటి పాత్రలో నటించడం సంతోషంగా ఉంద"ని చెప్పుకొచ్చింది.

## యాక్టింగ్‌లోనే కంటిన్యూ కావాలని అప్పుడు నిర్ణయించుకున్నా: విజయ్ దేవరకొండ



మూవీ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :నాని హీరోగా విజయ్ దేవరకొండ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఎవడే సుబ్రమణ్యం' . మాళవికా నాయర్ కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా విడుదలై ఈ ఏడాదితో పదేళ్లు అవుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చిత్రబృందం రీయూనియన్ నిర్వహించింది. ఇందులో పాల్గొన్న నాని, విజయ్ దేవరకొండతోపాటు ఇతర బృందం సినిమాకు సంబంధించిన ఎన్నో విశేషాలను నెమరు వేసుకున్నారు. సినిమాలోని ఓ కీలక సన్నివేశాన్ని ఉద్దేశించి విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "నేను రుషి.. నాని సుబ్బు పాత్రల్లో ఒదిగిపోయి ఈ సీన్ పూర్తి చేశాం. యాక్టింగ్‌లోనే కొనసాగాలని ఈ సీన్‌లోనే నేను నిర్ణయించుకున్నా" అని తెలిపారు. ప్రస్తుతం ఈవీడియో నెటిజన్ల దృష్టిని విశేషంగా ఆకట్టుకుంటోంది. మార్చి 21న ఈసినిమా రీ రిలీజ్ కానున్న విషయం తెలిసిందే.

## కోర్ట్‌తో నా కల నెరవేరింది: శివాజీ



మూవీ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) :'కోర్ట్' సినిమాలో నేను చేసిన మంగపతి పాత్రకి అద్భుతమైన స్పందన వస్తోంది. ఇలాంటి బలమైన పాత్ర చేయాలన్న నా 25 ఏళ్ల కల ఈ సినిమాతో నెరవేరింది" అని నటుడు శివాజీ తెలిపారు. ప్రియదర్శి, శివాజీ, రోషన్, శ్రీదేవి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్'. రామ్ జగదీశ్ దర్శకత్వం వహించారు. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది.ఈ సినిమాలో మంగపతి పాత్ర పోషించిన శివాజీ విలేకరులతో మాట్లాడుతూ "నాకు నటనలో దాదాపు 12 ఏళ్ల విరామం వచ్చింది. నన్ను మళ్లీ నటించమని నా పిల్లలు కోరేవారు. నాకూ చేయాలని ఉండేది కానీ ఎవర్నీ అవకాశం అడగలేదు. సొంతంగా నేనే ఓ సినిమా నిర్మిద్దామనుకున్న సమయంలో '90స్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్ చేశాను. అది చేస్తున్నప్పుడు 'బిగ్ బాస్' అవకాశం వస్తే, చేశాను. ఆ షోతో నేనంటే ఏంటో ప్రపంచానికి తెలిసింది. వెబ్ సిరీస్ పెద్ద హిట్ కావడంతో దాదాపు ఎనభై కథలు విన్నాను. చాలావరకూ తండ్రి పాత్రలే కావడంతో తిరస్కరించాను.

"కోర్ట్'లో మంగపతి పాత్ర క్రెడిట్ డైరెక్టర్ రామ్‌దే. ఎస్వీ రంగారావు, గుమ్మడి, జగ్గయ్య, రాజనాలగార్లు మరపురాని పాత్రలు చేశారు. అలాంటి పాత్రలు చేయాలని నాకూ ఉండేది కానీ హీరోగా ఉండాలనే ఆలోచన ఎప్పుడూ లేదు. కొత్తవారిని ప్రోత్సహించడంలో నాని గొప్ప చొరవ చూపిస్తున్నారు. సూపర్ గుడ్ ఫిలిమ్స్, సురేష్ ప్రొడక్షన్, ఉషా కిరణ్ మూవీస్ వంటి బ్యానర్స్‌లా వాల్ పోస్టర్ సినిమా అవుతుంది.ఇక మంగపతి తరహాలో మెడికల్ షాప్ మూర్తి అనే ఓ క్యారెక్టర్ విన్నాను. ప్రస్తుతం నేను నిర్మాతగా, హీరోగా, లయ హీరోయిన్‌గా ఓ సినిమా చేస్తున్నా. అలాగే 'దండోరా' అనే మరో చిత్రంలో నటిస్తున్నాను" అని తెలిపారు. ఇంకా రాజకీయాల గురించి మాట్లాడుతూ "నేను ఏ పార్టీకి సపోర్ట్‌గా ఉండలేదు... మాట్లాడలేదు. నేను ప్రజల కోసం నిలబడ్డాను. ప్రాంతం కోసం, భావితరాల కోసం పోరాటం చేశాను" అని శివాజీ స్పష్టం చేశారు.

## శ్రద్ధా కపూర్‌తో పోలిక.. నాకొక ప్రశంస: యువ నటి

మూవీ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : 'లాపతా లేడీస్'తో ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు యువ నటి నితాన్షీ గోయల్ . ఇందులో ఆమె పూల్ కుమారీ పాత్ర పోషించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నితాన్షీ కొంతమంది నెటిజన్లు తనని శ్రద్ధాకపూర్ తో పోల్చి చూస్తున్నారని అన్నారు. అందుకు తాను ఏమాత్రం బాధ పడటం లేదన్నారు. నిజం చెప్పాలంటే అదొక ప్రశంస అని తెలిపారు.

"లాపతా లేడీస్' నా జీవితాన్ని ఎంతో మార్చేసింది. ఆ సినిమా విడుదలయ్యాక నేను ఎక్కడికి వెళ్లినా అందరూ నన్ను పూల్ అనే పిలుస్తున్నారు. అందుకు నాకెంతో సంతోషంగా అనిపిస్తుంది. సోషల్‌మీడియాలోనూ నన్ను ఫాలో అయ్యేవారి సంఖ్య పెరిగింది. ఇటీవల నేను షేర్ చేసిన ఫొటోలు కొన్నింటికి పలువురు నెటిజన్ల నుంచి విభిన్నమైన రియాక్షన్స్ వచ్చాయి. ముఖ్యంగా కొన్ని ఫొటోల్లో నేను శ్రద్ధాకపూర్‌లా ఉన్నానని పలువురు అన్నారు. అది నన్ను ఏమాత్రం బాధ పెట్టలేదు. అలాంటి కామెంట్స్ చూసి నేనెంతో మురిసిపోయాను. అది నాకొక ప్రశంస. ఆమెకు నేనొక వీరాభిమానిని. ఆమె మాదిరిగా నేను కూడా కెరీర్‌లో రాణించాలి. ఆమె డ్యాన్స్ నాకెంతో నచ్చుతుంది. ఆమె డ్యాన్స్ చేసిన 'ఏబీసీడీ 2'లో సన్ సాథియా పాట మా ఇంట్లో ఎప్పుడూ ప్లే అవుతూనే ఉంటుంది. ఆమె వేసిన స్టెప్పులను నేను కూడా నేర్చుకుంటున్నా" అని తెలిపారు.






## ఫ్యాషన్ రంగం ఓ ఆయుధం

మూవీ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : తన భావాలను ప్రపంచానికి తెలియజేయడానికి ఫ్యాషన్ రంగం ఓ ఆయుధమని అంటోంది తమన్నా. నటనతో మెప్పిస్తూనే.. కొత్త కొత్త బ్రాండ్‌లతో ఫ్యాషన్‌లో తళుక్కున మెరుస్తున్న అందాల తారలు ఎందరో! ప్రస్తుతం ఈ బాటలోనే అడుగు వేస్తున్న తమన్నా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని మాట్లాడుతూ.. "నా ఆలోచనలు, నేను ఎలా ఉండాలనుకుంటున్నాననే దానికి సంబంధించిన విషయాల్ని వ్యక్తీకరించడానికి ఫ్యాషన్ రంగం ఓ ముఖ్యమైన మార్గం. అదే నా బలం" అని అంది. 'ఓదెల 2' గురించి మాట్లాడుతూ.. "ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌లో నేను ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచేలా కనిపిస్తాన"ని చెప్పుకొచ్చింది.

## 'రాబిన్‌హుడ్' నుంచి వార్నర్ లుక్ రిలీజ్

మూవీ న్యూస్, 15 మార్చి (క్రాంతిన్యూస్ ) : వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ ,శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటించిన 'రాబిన్‌హుడ్' చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రచారంలో భాగంగా టీమ్ ఈ సినిమాలోని వార్నర్ లుక్‌ను రిలీజ్ చేస్తూ అతడికి ఇండస్ట్రీలోకి స్వాగతం పలికింది. 'ఫ్రమ్ బౌండరీ టూ బాక్సాఫీస్' అంటూ వార్నర్‌కు వెల్‌కమ్ చెప్పింది. ఇక ఈ సినిమా ప్రచారంలోనూ వార్నర్ పాల్గొంటారని ఇటీవల వెంకీ కుడుముల వెల్లడించారు.




Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com